

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS


మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | మంగళవారం 31-03-2026 | సంపుటి - 27 | సంచిక -308 | రూ : 4 | పేజీలు: 8


## 'హేట్ స్పీచ్' బిల్లు ప్రజాస్వామ్య గొంతును నొక్కేందుకే



- రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 'హేట్ స్పీచ్' బిల్లుపై కేటీఆర్ తీవ్ర విమర్శలు
- ప్రజాస్వామ్య గొంతును నొక్కేందుకే ఈ చట్టం తెస్తున్నారని ఆరోపణ
- బిల్లులోని నిబంధనలు అస్పష్టంగా, దుర్వినియోగానికి ఆస్కారం కల్పిస్తాయన్న కేటీఆర్

2లో



## న్యాయవాదుల రక్షణ కోసం ప్రొటెక్షన్ బిల్లు

- అడ్వకేట్స్ ప్రొటెక్షన్ బిల్లు తీసుకువస్తామన్న మంత్రి
- న్యాయవాది వామనరావుదంపతుల హత్యను ప్రస్తావించిన మంత్రి
- బీఆర్ఎస్ నాయకుల ప్రోద్భలంతోనే వారు హత్యకు గురయ్యారని ఆరోపణ

హైదరాబాద్ : తెలంగాణ అడ్వకేట్స్ ప్రొటెక్షన్ బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడారు. న్యాయవాదుల సంక్షేమం, రక్షణకు మా ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోంది. అర్హులైన న్యాయవాదులకు ఇన్సూరెన్స్, హెల్త్ కార్డు సౌకర్యాన్ని కల్పిస్తున్నామని శ్రీధర్ బాబు స్పష్టం చేశారు.

తరువాయి 2లో

# ఆహార కల్తీపై ఉక్కుపాదం

- ఈగల్, హైడ్రా తరహాలో ప్రత్యేక వ్యవస్థ
- విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించడమే లక్ష్యం
- పంటల మార్పిడిపై రైతుల్లో అవగాహన తీసుకురావాలి
- సన్నబియ్యంతో పాటు.. మరిన్ని నిత్యావసరాలను అందించే ప్రణాళిక
- 50 శాతం సీట్ల పెంపుతో దక్షిణాదికి నష్టం
- మీడియాతో ఇష్టాగోష్ఠిలో సీఎం రేవంత్‌రెడ్డి

2లో



## ఇరాన్.. ఒప్పందం కుదుర్చుకోవాల్సిందే: ట్రంప్

- లేకపోతే మీ విద్యుత్కేంద్రాలు, చమురు క్షేత్రాలను సర్వనాశనం చేస్తాం
- ఇరాన్‌కు ట్రంప్ తీవ్ర హెచ్చరిక
- ఖర్గ్ దీవిని సులువుగా స్వాధీనం చేసుకోగలమని వ్యాఖ్య
- శాంతి చర్చలపై తొలగని ప్రతిష్టంభన
- అమెరికాఇరాన్ చర్చలకు త్వరలో ఆతిథ్యమిస్తామన్న పాక్
- ఆ ప్రణాళికలతో తమకు సంబంధం లేదన్న టెహ్రాన్
- కువైట్‌పై ఇరాన్ దాడిలో భారతీయుడి మృత్యువాత

దుబాయ్: పశ్చిమాసియాలో యుద్ధానికి ముగింపు పలికే శాంతిచర్చలపై ప్రతిష్టంభన కొనసాగుతోంది. అమెరికా ఇరాన్ చర్చలకు తాము త్వరలోనే ఆతిథ్యమిస్తామని తాజాగా పాకిస్థాన్ ప్రకటించగా.. ఇరాన్ మాత్రం అసలు పాక్ మధ్యవర్తిత్వ ప్రణాళికలతో తమకు సంబంధమే లేదని స్పష్టంచేసింది. ఇస్లామాబాద్ వేదికగా సౌదీ అరేబియా,

తరువాయి 2లో



## జనగణన తొలి దశ రేపటి నుంచి.. 33 ప్రశ్నలతో సమాచార సేకరణ

- వ్యక్తిగత డేటా గోప్యతకు పూర్తి భద్రత
- కులం వివరాలు రెండో దశలో సేకరణ
- సెన్సస్ కమిషనర్ మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ వెల్లడి




దిల్లీ: జనగణన మహాయజ్ఞంలో తొలి భాగమైన గృహగణన బుధవారం దేశవ్యాప్తంగా ప్రారంభం కానుంది. ఇందుకు సంబంధించిన వివరాలను రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా, సెన్సస్ కమిషనర్ మృత్యుంజయ్‌కుమార్ నారాయణ్ సోమవారం ఇక్కడ జాతీయ మీడియా సెంటర్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. దేశ చరిత్రలో 1872లో మొదలైన తొలి జనగణనతో కలుపుకొంటే ఇప్పుడు చేపట్టబోయేది 16వది, స్వతంత్ర భారతదేశంలో 8వది. తొలిసారి డిజిటల్ రూపంలో వివరాలు సేకరిస్తున్నారు. జనగణనలో భాగంగా సేకరించే వ్యక్తిగత డేటాను గోప్యంగా ఉంచుతారు. ఏ ప్రభుత్వ, ప్రభుత్వేతర

తరువాయి 2లో

## పొంగులేటిని బర్తరఫ్ చేయాలి


2లో

- మంత్రి అక్రమాలపై స్వతంత్ర న్యాయ విచారణకు ఆదేశించాలి
- అక్రమ మైనింగ్, భూకబ్జాలపై చర్యలు తీసుకోవాలి
- గవర్నర్‌కు బీఆర్ఎస్ ఫిర్యాదు..సాక్ష్యాధారాలు అందజేత

హైదరాబాద్: పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని బీఆర్ఎస్ డిమాండ్

తరువాయి 2లో

## దక్షిణ సూడాన్‌లో నరమేధం.. 70 మంది మృతి




- దక్షిణ సూడాన్‌లో బంగారు గనిపై సాయుధుల దాడి
- ఈ ఘటనలో 70 మందికి పైగా పౌరులు మృతి
- రాజధాని జుబా సమీపంలోని జెబెల్ ఇరాక్ గని వద్ద ఘటన
- గని వద్ద వివాదమే దాడికి కారణమని ప్రాథమిక సమాచారం
- అక్రమ మైనింగ్, సాయుధ గ్రూపుల మధ్య ఘర్షణలే కారణమంటున్న విశ్లేషకులు

2లో

## 21 నెలల్లో 5.50 లక్షల ఇళ్లు

- కూటమి ప్రభుత్వం పేదల ఇళ్లకిచ్చే ప్రాధాన్యానికి ఇదే నిదర్శనం
- జగన్ ఐదేళ్లలో కట్టింది 6లక్షలే
- ఆయనకేమో ప్యాలెస్.. బడుగుల ఇళ్లపై మాత్రం మీనమేషాలా?
- నాయుడుపేటలో టిడ్కో ఇళ్ల ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- కేంద్రం రూ.28 కోట్ల జరిమానా విధించినా నాటి పాలకులకు సిగ్గు లేదని ధ్వజం
- ప్రతి ఒక్కరూ పీఎన్‌జీ కనెక్షన్ తీసుకోవాలని పిలుపు

2లో




## గల్ఫ్ ప్రాంతాన్ని సురక్షితంగా దాటిన రెండు భారత నౌకలు


2లో

- భారత తీరం వైపు వస్తున్న రెండు భారీ ఎల్పీజీ నౌకలు
- సుమారు 94,000 టన్నుల ఎల్పీజీతో ప్రయాణం
- గల్ఫ్ ప్రాంతంలో భారత నావికులు, నౌకలు క్షేమంగా ఉన్నారని కేంద్రం ప్రకటన
- ఇప్పటివరకు

# ‘హేట్ స్పీచ్’ బిల్లు ప్రజాస్వామ్య గొంతును నొక్కేందుకే: కేటీఆర్

హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన ‘తెలంగాణ హేట్ స్పీచ్ అండ్ హేట్ క్రైమ్స్ (ప్రివెన్షన్) బిల్లు’పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇది ప్రజాస్వామ్య గొంతుకను నొక్కేందుకు ప్రభుత్వం ప్రయోగిస్తున్న ఒక ‘క్రూరమైన ఆయుధం’ అని ఆయన అభివర్ణించారు. వాళ్లను విమర్శించే వారి నోళ్లు మూయించేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఇటువంటి నిరంకుశ చట్టాలను తీసుకువస్తోందని ఆయన సోమవారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. ఈ బిల్లు గనుక చట్టరూపం దాల్చితే, రాజ్యాంగం పౌరులకు కల్పించిన భావప్రకటన స్వేచ్ఛకు, ప్రజాస్వామ్య వ్యవస్థ మూలాలకే పెను ముప్పు వాటిల్లుతుందని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. సామాజిక సామరస్యాన్ని కాపాడటం ప్రభుత్వ బాధ్యతే అయినా, దానికోసం తీసుకొస్తున్న ఈ బిల్లులోని నిబంధనలు అత్యంత అస్పష్టంగా ఉన్నాయని కేటీఆర్ విమర్శించారు. “ఈ బిల్లు రూపకల్పనను పరిశీలిస్తే, అమలు యంత్రాంగం వాస్తవ ఆధారాల కంటే అధికారుల వ్యక్తిగత అభిప్రాయాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేలా ఉంది. ఇది కచ్చితంగా అధికార దుర్వినియోగానికి దారితీస్తుంది” అని ఆయన పేర్కొన్నారు. బిల్లులో పొందుపరిచిన ‘వ్యతిరేక భావాలు ప్రేరేపించడం’, ‘సామాజిక సమగ్రతను దెబ్బతీయడం’ వంటి పదాలకు స్పష్టమైన న్యాయ నిర్వచనం, పరిమితులు లేవని ఆయన ఎత్తిచూపారు. ఈ పదజాలం ఉద్దేశపూర్వకంగానే అస్పష్టంగా ఉంచారని, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టే ప్రతిపక్ష నాయకులు, జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలను లక్ష్యంగా చేసుకునేందుకే ఇలా చేశారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాలను విమర్శిస్తే, వాటిని ‘ఫేక్ న్యూస్’గా ముద్రవేసి జైలుకు పంపే ప్రమాదం ఉందని కేటీఆర్ హెచ్చరించారు. ఇప్పటికే దేశంలో విద్వేష ప్రసంగాలను అరికట్టేందుకు ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ), క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సీఆర్‌పీసీ) వంటి చట్టాలు బలంగా ఉన్నాయని గుర్తుచేశారు. “ఇప్పటికే తగినన్ని చట్టాలు ఉండగా, అదనంగా ఈ కొత్త చట్టం తీసుకురావడంలో ప్రభుత్వ ఆంతర్యం ఏమిటి?” అని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఈ బిల్లును తక్షణమే ఉపసంహరించుకోవాలని, అణచివేత ధోరణిని విడనాడి ప్రజాస్వామ్య విలువలను గౌరవించాలని కేటీఆర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## న్యాయవాదుల రక్షణ కోసం ప్రొటెక్షన్ బిల్లు

హైదరాబాద్: తెలంగాణ అడ్వకేట్స్ ప్రొటెక్షన్ బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడారు. న్యాయవాదుల సంక్షేమం, రక్షణకు మా ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోంది. అర్హులైన న్యాయవాదులకు ఇన్సూరెన్స్, హెల్త్ కార్డు సౌకర్యాన్ని కల్పిస్తున్నామని శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. సామాజిక న్యాయానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. మాటలకే పరిమితం కాకుండా చేతల్లో చేసి చూపిస్తున్నాం. పీపీలు, స్టాండింగ్ కౌన్సిల్స్, ఇతర లీగల్ నియామకాల్లో బీసీలు, ఎస్సీలు, ఎస్టీలకు పెద్ద పీట వేస్తున్నాం. ఈ విషయంలో కేంద్రం సామాజిక న్యాయం పాటించడం లేదు. లెక్కలు తీస్తే అసలు విషయం బయటపడుతుంది. ఈ వివక్షతపై సభలోని బీజేపీ సభ్యులు సమాధానం చెబుతారు...? అని మంత్రి నిలదీశారు. రాష్ట్రంలో 414 మంది పీపీలు ఉంటే.. అందులో బీసీలు 126, ఎస్సీ లు 59, ఎస్టీలు 25 మంది ఉన్నారు. ఏపీపీల్లో ఓసీలు 24 మంది, బీసీలు 37 మంది, ఎస్సీలు 16, ఎస్టీలు 3, మైనార్టీ వర్గం నుంచి ఒకరు ఉన్నారు. మహిళా న్యాయవాదుల కోసం ప్రత్యేకంగా బార్ అసోసియేషన్ హాల్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. న్యాయ నిర్మాణ్ ప్రాజెక్ట్ కింద వారికి కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పనలు కృషి చేస్తాం. న్యాయవాదులకు సమగ్ర సంరక్షణకు ఉద్దేశించిన ఈ బిల్లుకు ఏకగ్రీవ ఆమోదం తెలిపిన సభ్యులకు ప్రభుత్వం తరపున కృతజ్ఞతలు అని పేర్కొంటూ శ్రీధర్ బాబు తన ప్రసంగాన్ని ముగించారు.

## ఇరాన్.. ఒప్పందం కుదుర్చుకోవాల్సిందే: ట్రంప్

దుబాయ్: పశ్చిమాసియాలో యుద్ధానికి ముగింపు పలికే శాంతిచర్చలపై ప్రతిష్టంభన కొనసాగుతోంది. అమెరికాఇరాన్ చర్చలకు తాము త్వరలోనే ఆతిథ్యమిస్తామని తాజాగా పాకిస్థాన్ ప్రకటించగా.. ఇరాన్ మాత్రం అసలు పాక్ మధ్యవర్తిత్వ ప్రణాళికలతో తమకు సంబంధమే లేదని స్పష్టంచేసింది. ఇస్లామాబాద్ వేదికగా సౌదీ అరేబియా, ఈజిప్టు, తుర్కియే విదేశాంగ మంత్రులు సోమవారమూ భేటీ కావాల్సి ఉన్నా.. ఆ సమావేశం జరగకముందే వారు స్వదేశాలకు పయనమవడం సైతం పలు అనుమానాలకు తావిస్తోంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా ఇరాన్‌పై హెచ్చరికల స్వరాన్ని మరింత పెంచారు. త్వరగా ఒప్పందం కుదుర్చుకొని, హర్మూజ్ జలసంధిని పూర్తిగా తెరవాలని ఆ దేశానికి సూచించారు. లేకపోతే ఇరాన్ ఇంధన కేంద్రాలు, మౌలిక సదుపాయాలను సర్వనాశనం చేస్తామని హెచ్చరించారు. ఖర్గ్ దీవినీ ఆక్రమించుకుంటామన్న సంకేతాలిచ్చారు. మరోవైపు భీకర దాడులతో పశ్చిమాసియా దద్దరిల్లుతూనే ఉంది. కువైట్‌పై ఇరాన్ జరిపిన దాడిలో ఓ భారతీయుడు ప్రాణాలు కోల్పోయాడు.

### 8కి పెరిగిన భారతీయ మృతుల సంఖ్య

కువైట్‌లోని ఓ కీలక విద్యుత్, నిర్లవణీకరణ కర్మాగారంపై ఇరాన్ ఆదివారం దాడి చేసింది. ఈ ఘటనలో భారతీయ కార్మికుడు ప్రాణాలు కోల్పోయాడు. 10 మంది సైనికులు గాయపడ్డారు. భారతీయుడి మరణాన్ని కువైట్‌లోని భారత రాయబార కార్యాలయం ధ్రువీకరించింది. దీంతో ఈ యుద్ధంలో ఇప్పటివరకూ మరణించిన భారతీయుల సంఖ్య ఎనిమిదికి పెరిగింది.

### సంప్రదింపులపై భిన్న స్వరాలు

పశ్చిమాసియాలో శాంతిని నెలకొల్పే ప్రయత్నాల్లో భాగంగా ఇస్లామాబాద్ వేదికగా సౌదీ, ఈజిప్టు, తుర్కియే, పాక్ విదేశాంగ మంత్రులు ఆదివారం చర్చలు జరిపారు. అనంతరం పాక్ విదేశాంగ మంత్రి ఇషాక్ దర్ విలేకర్లతో మాట్లాడారు. తమ మధ్యవర్తిత్వంలో సంప్రదింపులు జరగనుండటంపై అమెరికా, ఇరాన్ విశ్వాసం వ్యక్తంచేశాయన్నారు. త్వరలోనే వాటి మధ్య చర్చలకు ఆతిథ్యమిస్తామని చెప్పారు. అయితే ఈ విషయంపై అమెరికా స్పందించలేదు. పాక్ మధ్యవర్తిత్వ ప్రణాళికలతో తమకు సంబంధం లేదని ఇరాన్ పేర్కొంది. ‘‘అమెరికాతో ప్రత్యక్ష చర్చలు ఏమీ లేవు. మధ్యవర్తుల ద్వారా అసమంజస డిమాండ్లు బయటకు వచ్చాయంతే. దౌత్యం విషయంలో అమెరికా తరచూ మాట మారుస్తోంది. మా వైఖరి మాత్రం స్పష్టంగా ఉంది. పాక్ మధ్యవర్తిత్వ ప్రణాళికలు దాని సొంతమే. వాటిలో మా ప్రమేయం లేదు’’ అని ముంబయిలోని ఇరాన్ కాన్సులేట్ జనరల్ ‘ఎక్స్’లో స్పష్టంచేయడం గమనార్హం. సౌదీ, ఈజిప్టు, తుర్కియే విదేశాంగ మంత్రులు ఇస్లామాబాద్‌లో భేటీ కాకుండానే స్వదేశాలకు వెళ్లిపోయారు.

## 21 నెలల్లో 5.50 లక్షల ఇళ్లు

తిరుపతి: ‘కూటమి ప్రభుత్వం గృహ నిర్మాణాలకు ప్రాధాన్యం ఇస్తోంది. 21 నెలల్లో 5.50 లక్షల ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు ఇవ్వడమే దీనికి నిదర్శనం. గత ప్రభుత్వం ఐదేళ్లలో కేవలం ఆరు లక్షలు మాత్రమే నిర్మించింది’ అని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. 2029 నాటికి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు కట్టిస్తామని స్పష్టం చేశారు. విశాఖలో ప్యాలెస్ కట్టుకున్న వ్యక్తి.. పేదల ఇళ్లపై మీనమేషాలు లెక్కించారని మాజీ సీఎం జగన్‌ను ఎద్దేవా చేశారు. గృహ నిర్మాణానికి ఇచ్చిన నిధులు మళ్లించడంతో కేంద్రం రూ.28 కోట్ల జరిమానా విధించినా నాటి పాలకులకు సిగ్గు లేదని ధ్వజమెత్తారు. 48 ఏళ్ల తన రాజకీయ చరిత్రలో అలాంటి పనికిమాలిన ప్రభుత్వాన్ని చూడలేదని చంద్రబాబు మండిపడ్డారు. తిరుపతి జిల్లా నాయుడుపేట మండలం పుదూరులో నిర్మించిన టిడ్కో ఇళ్లను ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా 30 ప్రాంతాల్లో 2,50,893 ఇళ్లను లబ్ధిదారులకు ఇక్కడి నుంచే అప్పగిస్తున్నట్లు ప్రకటించారు. లబ్ధిదారులైన ముక్కర అంబిక, షేక్ నూరి గృహాలకు వెళ్లి వారికి నూతన వస్త్రాలు అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. లబ్ధిదారుల ఇంటికి నేమ్ బోర్డును ఆయనే తగిలించారు. అనంతరం లబ్ధిదారులు, ప్రజలను ఉద్దేశించి సీఎం ప్రసంగించారు.

## జనగణన తొలి దశ రేపటి నుంచి.. 33 ప్రశ్నలతో సమాచార సేకరణ

దిల్లీ: జనగణన మహాయజ్ఞంలో తొలి భాగమైన గృహగణన బుధవారం దేశవ్యాప్తంగా ప్రారంభం కానుంది. ఇందుకు సంబంధించిన వివరాలను రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా, సెన్సస్ కమిషనర్ మృత్యుంజయ్‌కుమార్ నారాయణ్ సోమవారం ఇక్కడ జాతీయ మీడియా సెంటర్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. దేశ చరిత్రలో 1872లో మొదలైన తొలి జనగణనతో కలుపుకొంటే ఇప్పుడు చేపట్టబోయేది 16వది, స్వతంత్ర భారతదేశంలో 8వది. తొలిసారి డిజిటల్ రూపంలో వివరాలు సేకరిస్తున్నారు. జనగణనలో భాగంగా సేకరించే వ్యక్తిగత డేటాను గోప్యంగా ఉంచుతారు. ఏ ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థతోనూ కేంద్రం పంచుకోదు. కాబట్టి వాటి ఆధారంగా విచారణలు, దర్యాప్తులు చేపట్టడానికి అనుమతి ఉండదు. ఈ వివరాలను సమాచారహక్కు చట్టం (ఆర్టీఐ) కింద కూడా ఇవ్వరు. న్యాయస్థానాల్లో సాక్ష్యాలుగా వినియోగించడానికి వీల్లేదు.

### 33 ప్రశ్నలతో సమాచార సేకరణ

తొలిదశలో గృహగణన కార్యక్రమం ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబరు 30 వరకు దేశంలోని అన్ని రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో స్థానికంగా ప్రకటించిన తేదీల వారీగా నెలరోజులపాటు జరుగుతుంది. ఇందులో 33 ప్రశ్నల ఆధారంగా ప్రజల ఇళ్ల స్థితిగతులు, ఇంట్లోనివారి పరిస్థితులు, వారికి అందుబాటులో ఉన్న సౌకర్యాలు, చరాస్తుల వివరాలు అడిగి నమోదు చేస్తారు. పౌరులు చెప్పిన వివరాలను ఎన్యూమరేటర్లు యథాతథంగా నమోదు చేసుకుంటారు. గృహగణన కార్యక్రమం ఆంధ్రప్రదేశ్‌లో మే 1 నుంచి 30 వరకు, తెలంగాణలో అదే నెల 11 నుంచి జూన్ 9 వరకు జరుగుతుంది. దీనికి 15 రోజుల ముందు నుంచి సెల్ఫ్ ఎన్యూమరేటర్ పోర్టల్‌లో ప్రజలు తమ గృహసంబంధ వివరాలను స్వయంగా నమోదు చేయొచ్చు. భారత ప్రభుత్వం ఆధ్వర్యంలోని సీడాక్ అభివృద్ధి చేసిన మొబైల్ యాప్ ద్వారా మొత్తం 16 భారతీయ భాషల్లో వివరాల నమోదు కార్యక్రమం జరుగుతుంది.

### స్వయంగానూ వివరాల నమోదు

ప్రస్తుత తొలిదశలో గృహసంబంధ వివరాలు రాబట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 33 ప్రశ్నల ఆధారంగా ప్రజలు సొంతంగానే తమ వివరాలను https://se.census.gov.in వెబ్‌సైట్‌లో లేదా మొబైల్‌యాప్‌లో నమోదుచేయొచ్చు. ఇంటి పెద్ద పేరు, మొబైల్ నంబరు, ఈమెయిల్ నమోదు చేసిన వెంటనే ఓటీపీ వస్తుంది. దాన్ని ఎంటర్ చేసిన తర్వాత ప్రశ్నావళితో కూడిన పోర్టల్ తెరుచుకుంటుంది. అక్కడ వివరాలన్నీ నమోదుచేసి సమర్పించిన తర్వాత ‘హెచ్’ అనే ఇంగ్లిష్ అక్షరంతో ప్రారంభమయ్యే 11 అంకెల ఐడీ కనిపిస్తుంది. అది ఎస్ఎంఎస్ ద్వారానూ వస్తుంది. ఎన్యూమరేటర్లు ఇంటికి వచ్చినప్పుడు ఆ ఐడీని వారికివ్వాలి. స్వయంగా నమోదుచేసిన వివరాలన్నీ సరిగా ఉంటే సరే. మార్పులు చేర్పులు ఏమైనా ఉంటే ఆ సమయంలో సరి చేసుకోవచ్చు. తొలి దశలో కులగణన ఉండదు. వ్యక్తిగత జనాభా వివరాలు సేకరించే రెండో దశలో మాత్రమే కులం, మతం వివరాలు సేకరిస్తారు. ఈ వివరాల ఆధారంగా ప్రభుత్వ పథకాలు ఇవ్వడం, తొలగించడం జరగదు. డేటా భద్రతకోసం హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్‌పరంగా అన్ని రకాల చర్యలూ తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి ఎలాంటి పత్రాలను ఎన్యూమరేటర్లు సేకరించరు. సెల్ఫ్ ఎన్యూమరేషన్ ఎన్ఆర్ఐలకు ఉండదు. జాతీయ జనాభా పట్టిక (ఎన్‌పీఆర్) అప్‌డేషన్ ఇప్పుడు చేపట్టడంలేదు. జనాభాకు సంబంధించిన వివరాలన్నింటినీ దాదాపుగా 2027లోనే బహిర్గతం చేస్తారు. సొంతంగా గృహగణన వివరాలు నమోదు చేసేటప్పుడు తలెత్తే సందేహాలను తీర్చటానికి పోర్టల్‌లో తరచూ అడిగే ప్రశ్నల (ఎఫ్ఏక్యూ) పేరుతో ఓ విభాగాన్ని పెట్టారు.

## పొంగులేటిని బర్తరఫ్ చేయాలి

హైదరాబాద్: పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది. ఆయన అక్రమ మైనింగ్, భూకబ్జాలపై సోమవారం హైదరాబాద్ లోక్‌భవన్‌లో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కలిసి ఫిర్యాదు చేశారు. అక్రమ మైనింగ్, భూకబ్జాలపై సాక్ష్యాధారాలను అందజేసింది. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అక్రమాలపైన స్వతంత్ర న్యాయ విచారణకు ఆదేశించాలనీ, లేదంటే హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని విజ్ఞప్తి చేసింది. రాఘవ కన్‌స్ట్రక్షన్ కంపెనీ మైనింగ్ నిబంధనలను ఉల్లంఘించిందని తెలిపింది. జంట జలాశయాల పరిధిలో మైనింగ్ నిషేధం ఉన్నా అక్రమంగా మైనింగ్‌కు పాల్పడిందని విమర్శించింది. సంబంధం లేని భూమిని చెరబట్టి ఎలాంటి మినరల్ డీలర్ లైసెన్స్, పొల్యూషన్ బోర్డు అనుమతి, విద్యుత్ కనెక్షన్లు, పరిశ్రమల శాఖ అనుమతి లేకుండా రెండేండ్లుగా రూ.వందల కోట్ల ప్రజా సంపదను కొల్లగొట్టిందని వివరించింది. మంత్రిపై చర్యలు తీసుకోవాలని కోరితే సభ నుంచి తమను ప్రభుత్వం బహిష్కరించిందని తెలిపింది. అనంతరం మీడియాతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన గురించి గవర్నర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి రాష్ట్ర సంపదను కొల్లగొట్టారని విమర్శించారు. శాసన సభా సంఘాన్ని ఏర్పాటు చేస్తే అన్ని వాస్తవాలూ బయటకు వస్తాయని చెప్పారు. మంత్రి పొంగులేటి రూ.వందల కోట్ల అక్రమ మైనింగ్‌తోపాటు అక్రమ భూకబ్జాలు బయటకు వస్తాయన్నారు. ప్రభుత్వ ఏజెన్సీలతోనే విచారణ జరిపిస్తామంటున్నారనీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డే స్వయంగా హోంమంత్రి బాధ్యతల్లో ఉన్నపుడు సీబీసీఐడీ విచారణ లేదా రాష్ట్ర హోం శాఖ అధికారులతో న్యాయం జరుగుతుందన్న నమ్మకం లేదన్నారు. అందుకే ఒక శాసనమండలి, శాసనసభ్యులతో కూడిన సభా సంఘాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేదా స్వతంత్ర న్యాయ విచారణ, హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణకు ఆదేశించాలని గవర్నర్‌కు వివరించామన్నారు. రాష్ట్రంలో ఎమర్జెన్సీ ఇందిరమ్మ పాలన రోజులు గుర్తుకొస్తున్నాయని అన్నారు. ప్రభుత్వ దోపిడీని ప్రజాక్షేత్రంలోనే ఎండగడతామని చెప్పారు. బ్లాక్‌మెయిల్‌కు బ్రాండ్ అంబాసిడర్ సీఎం రేవంత్‌రెడ్డి అని విమర్శించారు. రైట్ టు ఇన్ఫర్మేషన్ యాక్ట్‌ను రూట్ టు ఇన్‌కంగా ఆయన మార్చుకున్నారని వివరించారు. బ్లాక్‌మెయిల్ రాజకీయాలు ఆయనకు తెలిసినంతగా ఈ దేశంలో మరెవరికీ తెలియవన్నారు. 14 అంశాలపై విచారణ చేయాలంటూ సీఎంకు లేఖ రాశామని గుర్తు చేశారు. వాటిపై విచారణ చేయాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి దమ్ముంటే పొంగులేటిని బర్తరఫ్ చేసి విచారణ జరపాలన్నారు. మంత్రిగా ఉన్నందున ఆయన విచారణను ప్రభావితం చేసే అవకాశముందని చెప్పారు. ఈ విషయంలో గవర్నర్ జోక్యం చేసుకుని న్యాయం చేయాలని కోరారు. ఈ అంశంలో సాక్ష్యాధారాలను ఇచ్చినా బీజేపీ మౌనంగా ఉందనీ, ప్రభుత్వంపై ఒత్తిడి తేలేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అవినీతి, పొంగులేటి అక్రమ మైనింగ్, భూకబ్జాలపైన త్వరలోనే మరింత కార్యాచరణ ప్రకటిస్తామని వివరించారు.

## 'హేట్ స్పీచ్' బిల్లు ప్రజాస్వామ్య గొంతును నొక్కేందుకే: కేటీఆర్

హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన 'తెలంగాణ హేట్ స్పీచ్ అండ్ హేట్ క్రైమ్స్ (ప్రివెన్షన్) బిల్లు'పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇది ప్రజాస్వామ్య గొంతుకను నొక్కేందుకు ప్రభుత్వం ప్రయోగిస్తున్న ఒక 'క్రూరమైన ఆయుధం' అని ఆయన అభివర్ణించారు. వాళ్లను విమర్శించే వారి నోళ్లు మూయించేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఇటువంటి నిరంకుశ చట్టాలను తీసుకువస్తోందని ఆయన సోమవారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. ఈ బిల్లు గనుక చట్టరూపం దాల్చితే, రాజ్యాంగం పౌరులకు కల్పించిన భావప్రకటన స్వేచ్ఛకు, ప్రజాస్వామ్య వ్యవస్థ మూలాలకే పెను ముప్పు వాటిల్లుతుందని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. సామాజిక సామరస్యాన్ని కాపాడటం ప్రభుత్వ బాధ్యతే అయినా, దానికోసం తీసుకొస్తున్న ఈ బిల్లులోని నిబంధనలు అత్యంత అస్పష్టంగా ఉన్నాయని కేటీఆర్ విమర్శించారు. "ఈ బిల్లు రూపకల్పనను పరిశీలిస్తే, అమలు యంత్రాంగం వాస్తవ ఆధారాల కంటే అధికారుల వ్యక్తిగత అభిప్రాయాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేలా ఉంది. ఇది కచ్చితంగా అధికార దుర్వినియోగానికి దారితీస్తుంది" అని ఆయన పేర్కొన్నారు. బిల్లులో పొందుపరిచిన ‘వ్యతిరేక భావాలు ప్రేరేపించడం’, ‘సామాజిక సమగ్రతను దెబ్బతీయడం’ వంటి పదాలకు స్పష్టమైన న్యాయ నిర్వచనం, పరిమితులు లేవని ఆయన ఎత్తిచూపారు.

# ఆహార కల్తీపై ఉక్కుపాదం

హైదరాబాద్: రాష్ట్రంలో ఆహార కల్తీపై ఉక్కుపాదం మోపనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆహార కల్తీ నియంత్రణకు ఈగల్, హైడ్రా తరహాలో ప్రత్యేక వ్యవస్థను తీసుకురానున్నట్లు ప్రకటించారు. దేశంలోని అన్ని రాష్ట్రాల చట్టాలను అధ్యయనం చేసి.. తెలంగాణకు తగిన పకడ్బందీ వ్యవస్థ రూపొందిస్తామన్నారు. పేదలకు కడుపునిండా అన్నం పెట్టాలనే బృహత్తర లక్ష్యంతో ప్రారంభించిన సన్నబియ్యం పథకం విజయవంతమైందని, తదుపరి లక్ష్యం దిశగా దృష్టి సారించామని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, సాంకేతికతల పెంపుతో పాటు.. పౌష్టికాహారం అందించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం పేర్కొన్నారు. ‘‘రైతుకు తాను పండించిన పంటకు న్యాయమైన ధర నిర్ణయించే హక్కు లేకపోవడం పెద్ద శాపమని ఆందోళన వ్యక్తంచేశారు. ఇందుకోసమే కనీస మద్దతు ధర చట్టాన్ని తీసుకొచ్చామన్నారు. పంటల మార్పిడి విధానం ద్వారా వాణిజ్య పంటల సాగు విస్తీర్ణం పెంచడం, జిల్లాల వారీగా శాస్త్రీయ అధ్యయనానికి టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేయడం ద్వారా రైతుకు మేలు జరిగే నిర్ణయాలు తీసుకోవచ్చన్నారు. రాష్ట్రంలో పేదలకు సన్నబియ్యం పంపిణీ ప్రారంభించి ఏడాది పూర్తయిన సందర్భంగా.. శాసనసభ భవనంలో పౌరసరఫరాలశాఖ ఆధ్వర్యంలో సోమవారం సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. ఇందులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు పాల్గొన్నారు. అనంతరం మండలి కమిటీ హాలులో మంత్రులు ఉత్తమ్, అడ్లూరి లక్ష్మణ్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, బీర్ల అయిలయ్య తదితరులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు.

- **100 శాతం సన్నబియ్యం ఇవ్వడానికి సిద్ధం**

‘‘నలభై ఏళ్లుగా తెలంగాణ పేదలకు రేషన్ ద్వారా దొడ్డుబియ్యమే పంపిణీ అవుతూ వచ్చింది. దీంతో ఆ బియ్యాన్ని సన్నాలుగా మార్చే మాఫియా విస్తరించింది. ఈక్రమంలో పేదలు తినగలిగే సన్నబియ్యం ఇవ్వాలని ప్రజాప్రభుత్వం నిర్ణయించింది. తెలంగాణ జనాభాలో 86 శాతం మంది ప్రజలు ఈ పథకం కింద లబ్ధి పొందుతున్నారు. భవిష్యత్తులో ఇది 90 శాతాన్ని అధిగమించవచ్చు. 100 శాతం మంది ఈ పథకం పరిధిలోకి వచ్చినా.. వారికి సన్నబియ్యం అందజేయడానికి మా ప్రభుత్వం సిద్ధంగా ఉంది. సోనియా గాంధీ తీసుకొచ్చిన జాతీయ ఆహార భద్రతా చట్టానికి రాష్ట్రంలో సరైన న్యాయం జరగాలని సంకల్పించాం. పిల్లలు ఆరోగ్యంగా, చదువులో రాణించాలంటే పుష్టికరమైన ఆహారం అవసరం. అందుకే వ్యవసాయ వైవిధ్యాన్ని ప్రోత్సహిస్తున్నాం. పేదల ఆకలి తీర్చడం, రైతుకు న్యాయం చేయడం, కల్తీ మాఫియాను అదుపు చేయడం.. ఈ 3 లక్ష్యాలతో ముందుకెళ్తున్నాం. సన్నబియ్యానికి అయ్యే ఆర్థికభారం కేంద్రం భరిస్తే.. ప్రధాని మోదీ బొమ్మ పెట్టి పంపిణీ చేస్తాం.

**రైతులకు ఆర్థిక బలం**

సన్న బియ్యం పథకం అమలు చేయాలంటే.. ఇక్కడే ఉత్పత్తి పెరగాలి. అందుకే సన్నాల సాగుకు ప్రోత్సాహకంగా క్వింటాకు రూ.500 బోనస్ ప్రకటించాం. ఎకరాకు ఏడాదికి రూ.25,000 లాభాన్ని అదనంగా అందించాం. ఆ పంటను ఇక్కడే కొని ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా ప్రజలకు అందిస్తున్నాం. సన్నబియ్యం పథకం రైతులకు ఆర్థిక బలాన్ని చేకూరుస్తోంది. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు వేస్తున్నాం. నిత్యావసర వస్తువులను అక్రమంగా నిల్వ ఉంచడం హత్యానేరం కంటే తీవ్రమైనది. ప్రజల ఆకలిని సొమ్ము చేసుకునే వారిని నియంత్రించేందుకు.. నాడు కాంగ్రెస్ ప్రభుత్వం పకడ్బందీ చట్టాలు తీసుకొచ్చింది. నేడు పటిష్ఠ నిఘా వ్యవస్థ నెలకొల్పనుంది. దేశంలో నిత్యావసర ధరలు తెలంగాణలోనే అతి తక్కువగా ఉన్నాయి. అన్నదాతల హక్కులను కాపాడేందుకు కాంగ్రెస్ ప్రభుత్వమే గతంలో కనీస మద్దతు ధర చట్టం తీసుకొచ్చింది. వరితో పాటు.. వాణిజ్య, పోషకాహార పంటల వైపు రైతులను ప్రోత్సహించేందుకు సిద్ధంగా ఉన్నాం. ఇందుకోసం ఇక్రిశాట్ శాస్త్రవేత్తలు, వ్యవసాయ నిపుణులు, ఆ శాఖ అధికారులతో కలిసి టాస్క్‌ఫోర్స్ కమిటీ వేయాలని యోచిస్తున్నాం. ఈ కమిటీ జిల్లాల వారీగా పంటల మార్పిడి సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేస్తుంది. రేషన్ కార్డు ద్వారా సన్నబియ్యంతో పాటు.. ఇతర నాణ్యమైన నిత్యావసరాలను అందించాలని ప్రభుత్వం యోచిస్తోంది’’ అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులపై తక్షణ చర్యలు: కలెక్టర్ అంకిత్



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ప్రజావాణిలో స్వీకరించిన ప్రతి దరఖాస్తును నిర్దిష్ట గడువులో పరిష్కరించేందుకు అధికారులు వేగవంతంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. ఐడీఓసీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ప్రజల వినతులను స్వయంగా స్వీకరించి, సంబంధిత శాఖలకు వెంటనే ఎండార్స్ చేశారు.ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం లేకుండా బాధ్యతగా వ్యవహరించాలని, ప్రతి దరఖాస్తుపై శాఖాధిపతులు వ్యక్తి గత పర్యవేక్షణతో గడువులో చర్యలు పూర్తి చేయాలని సూచించారు.

**ముఖ్య దరఖాస్తులు:**

భూమి పాస్‌పుస్తకం మంజూరు, విద్యుత్ సర్వీస్ నంబర్, ఉపాధి కల్పన, నీటి బిల్లుల సమస్య, ఈద్గా స్థలం కేటాయింపు వంటి అంశాలపై వచ్చిన ఫిర్యాదులను సంబంధిత శాఖలకు పంపించారు.

# అక్రమ అరెస్టులకు నిరసనగా రాస్తారోకో




నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఆశాలకు ఫిక్స్‌డు వేతనం 18000 ఇవ్వాలని చలో అసెంబ్లీ వెళ్తున్న ఆశలను అక్రమంగా అరెస్టు చేయడాన్ని సిఐటియు తీవ్రంగా ఖండిస్తుందని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల వీరారెడ్డి అన్నారు. సోమవారం సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నల్గొండ నియోజకవర్గ పరిధిలోని ఆశాలంతా నల్లగొండ సుభాష్ విగ్రహం దగ్గర రాస్తారోకో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వీరారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఆశ కార్యకర్తలకు పారితోషకాలు కాకుండా ఫిక్స్డ్ 18 వేల రూపాయల వేతనం ఇస్తామని ప్రకటించిందని గెలిచి రెండున్నర సంవత్సరాలు అవుతున్న హామీ అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. ప్రజా పాలన అని చెబుతూ ఉద్యమకారులపై నిర్బంధాన్ని ప్రయోగించడం సిగ్గుచేటు అని అన్నారు. ఇలాంటి నిర్బంధ చర్యలు మానుకోకపోతే ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. ఆశాలకు ఫిక్స్డ్ వేతనం 18000 నిర్ణయించాలని లేనియెడల రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు ల.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎండి సలీం , జిల్లా ఉపాధ్యక్షులు దండెంపల్లి సత్తయ్య, జిల్లా కమిటీ సభ్యురాలు సిహెచ్ అనురాధ, ఆశా వర్కర్స్ యూనియన్ తిప్పర్తి, కనగల్లు, రాములబండ , నల్లగొండ అర్బన్ లైన్ వాడ, మాన్యంచెల్క, పానగల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆశా కార్యకర్తలు పార్వతమ్మ ,కే స్వర్ణ, వజ్రమ్మ, వీరభద్రమ్మ, ప్రేమలత, అనురాధ, జీవనజ్యోతి, ప్రమీల, రాజేశ్వరి, హేమలత, మాధవి, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# లంచం డిజిటల్ రూపంలో వసూళ్లు



ఖమ్మం జిల్లా: ప్రజాస్ఫూర్తి . ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏసీబీ దాడులు భయంతో అవినీతి అధికారులు కొత్త మార్గాలను వెతుకుతున్నారు . నేరుగా లంచాలు తీసుకుంటే పట్టుబడతామని భావించి . బినామీలు లేదా స్నేహితుల యుపీఐ రూపంలో వసూళ్లకు పాల్పడుతున్నారు . రవాణా , పోలీస్ , రిజిస్ట్రేషన్ శాఖల్లో ఈ " డిజిటల్ కరప్షన్ " పెరిగినట్లు ఫిర్యాదులందాయి . బాధితులు ఇచ్చిన ఆధారాలతో అప్రమత్తమైన ఏసీబీ అధికారులు , బినామీ ఖాతాల లావాదేవీలపై విచారణ జరుపుతున్నారు

# కొత్త మిర్చి , పత్తి ధరలకు రెక్కలు



ఖమ్మం జిల్లా , ప్రజాస్ఫూర్తి : ఖమ్మం వ్యవసాయ మార్కెట్లో ఇవాళ మిర్చి , పత్తి ధరలు ఈ విధంగా ఉన్నాయి . క్వింటా ఏసి మిర్చి ధర రూ . 19,425, అటు క్వింటా పత్తి ధర రూ . 7,700గా జెండపాట పలికినట్లు మార్కెట్ కమిటీ సభ్యులు తెలిపారు . గత శుక్రవారంతో పోల్చితే ఏసి మిర్చి ధర రూ .100 తగ్గగా , కొత్త మిర్చి ధర రూ . 125 , పత్తి ధర రూ . 200 పెరిగినట్లు వ్యాపారులు తెలిపారు .

# లోక్ ఆధాలత్ ద్వారా 6,572 కేసులు పరిష్కారం : సునీల్ దత్



ఖమ్మం జిల్లా : ప్రజాస్ఫూర్తి : జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్కు విశేష స్పందన లభించిందని సీపీ సునీల్ దత్ అన్నారు . వీటి ద్వారా 6,572 కేసులు పరిష్కారమయ్యాయని , డ్రంకెన్ అండ్ డ్రైవ్ కేసులో 3,971, ఈ పెట్టి కేసులో 1,837 ,ఎఫ్ఐఆర్ 764, 77 సైబర్ క్రైమ్ కేసుల్లో రూ . 36 లక్షలకు పైగా రిఫండ్ మొత్తాన్ని బాధితులకు అందజేశారని తెలిపారు . సైబర్ కేసులు 77 పరిష్కరించినట్లు చెప్పారు .

# నాలుగు లేబర్ కోడ్స్ రూల్స్ ప్రతులు దగ్ధం




మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టి యు సి ఐ) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ ప్రతులను మహబూబాబాద్ జిల్లా కేంద్రం లోని కోర్టు ఎదురుగా తగలబెట్టారు. అనంతరం టి యు సి ఐ రాష్ట్ర అధ్యక్షులు కే సూర్యం ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను మోడీ ప్రభుత్వం రద్దు చేసి వాటి స్థానంలో 4 లేబర్ కోడ్స్ ను తెచ్చి ఏప్రిల్ ఒకటవ తారీకు అమలుకు పూనుకున్నదని వారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం లేబర్ కోడ్స్ ను అమలు చేయొద్దనీ డిమాండ్ చేశారు. జరుగుతున్న శాసనసభలో లేబర్ కోడ్స్ అమలు చేయకుండా తీర్మానం చేయాలన్నారు.పారిశ్రామిక సంబంధాల కోడ్,వేతన కోడ్ సామాజిక భద్రత కోడ్ వృత్తిపరమైన భద్రత ఆరోగ్యం పని పరిస్థితుల కోడ్ ఈ నాలుగు లేబర్ కోడ్స్ కార్మికులకు, తీవ్రమైన నష్టదాయకమనీ అన్నారు. 4, లేబర్ కోడ్ లతో కార్మిక సంఘం ఏర్పాటు చేసుకునే హక్కును లేకుండా చేస్తుందన్నారు.మహిళలను రాత్రి వేళలో పనిచేసుకునేందుకు అవకాశం కలిపిస్తుందన్నారు. భవన నిర్మాణంలో ఎక్కువమంది మహిళాలే ఉన్నందున వారి భద్రత ప్రమాదంలో పడే అవకాశం ఉన్నది. ఇన్ఫోసిస్ అధినేత నారాయణ లాంటి కార్పొరేట్ సంస్థ అధిపతులు 72 నుంచి 90 గంటలు అంటే 12 నుంచి 14 గంటలపాటు పనులు చేయాలని కార్మికులకు ఉపదేశాలు ఇస్తున్నారు. ఆయా ప్రకటనల ప్రభావంతో భవన నిర్మాణ రంగంలో పనిగంటలు పెరిగే ప్రమాదమున్నదని వారన్నారు. కార్మిక సంఘాల వ్యతిరేకతను పెడచెవినపెట్టి ఏప్రిల్ ఒకటి నుండి లేబర్ కోడ్స్ ను అమలు చేసేందుకు మోడీ ప్రభుత్వం గెజిట్ విడుదల చేసిందన్నారు.2020 లో కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దుచేసి కొత్తగా నాలుగు లేబర్ కోడ్ ల ను, రూపొందించింది. ప్రస్తుతం అమలులో ఉన్న చట్టాలను రద్దు చేయడాన్ని, వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్ లను తేవడాన్నీ దేశవ్యాప్తంగా కార్మికులు కార్మిక సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయని వారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి రవి, జిల్లా ప్రధాన కార్యదర్శి బిళ్ళకంటి సూర్యం, జిల్లా నాయకులు శ్రీరాంపుల్లయ్య,పూజల లచ్చయ్య,నేరెళ్ల బలరాం, వ్యవసాయం కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు ఉమ్మగాని సత్యం,బోయిని ఉప్పలయ్య, సూరన్న తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

- : సిసి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన
- * ధర్మోజి గూడెం సర్పంచ్ జువ్వి నర్సింహ్మా



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తానని ధర్మోజి గూడెం సర్పంచ్ జువ్వి నర్సింహ్మా అన్నారు. చౌటుప్పల్ మండలం ధర్మోజి గూడెం గ్రామంలో ఉపాధి హామీ నిధులు రూ.5లక్షలతో చేపట్టిన సిసి రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జువ్వి నర్సింహ్మా మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో అభివృద్ధి నిలిచిపోయిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టడంతోనే గ్రామాల్లో అభివృద్ధి పుంజుకుందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీకే చెల్లిందన్నారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అడుగుజాడల్లో గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పక్కీరు శ్రీనివాస్ రెడ్డి, వార్డు సభ్యులు సామిడి సంధ్య, ఐతరాజు శారద లింగస్వామి, రాచకొండ భార్గవ్, జీడిముడ్ల శోభ, గునుగంటి వెంకటేశం, పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి, మాజీ ఉప సర్పంచ్ లు బత్తుల శ్రీహరి, కొంతం బుచ్చిరెడ్డి, గ్రామస్తులు ఊదరి లింగయ్య, దాసర్ల లింగయ్య, పగిళ్ళ అమర్ నాద్ రెడ్డి, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆశా వర్కర్లకు ఫిక్స్డ వేతనం 18000 ఇవ్వాలి

- * జిల్లా ఉపాధ్యక్షులు కుమ్మరి కుంట్ల నాగన్న




మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా ఆశా వర్కర్లు కంబాలపెల్లి పిహెచ్సి సెంటర్ ముందు నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ నిరసన కార్యక్రమం ఉద్దేశించి సి ఐ టి యు జిల్లా ఉపాధ్యక్షులు కుమ్మరి కుంట్ల నాగన్న మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో ఆశ వర్కర్లకు కనీస వేతనం 18 వేల రూపాయలు హామీ ఇవ్వడం జరిగింది ఇచ్చిన హామీని అమలు చేయకుండా రెండున్నర సంవత్సరాల నుండి కాలయాపన చేస్తుంది ప్రతినెల ఒకటవ తారీఖు నాడు వేతనం ఇవ్వాలని పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలని పని భారం తగ్గించాలని సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని వ్యక్తిగత బీమా సౌకర్యం అర్హులైన ఆశలును ఏఎన్ఎంలుగా గుర్తించాలని రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని మట్టి ఖర్చుల కింద లక్ష రూపాయలు ఇవ్వాలని ఆశలను ప్రభుత్వ ఉద్యోగాలు గుర్తించాలని ఈఎస్ఐపీఎఫ్ సౌకర్యం కల్పించాలని ప్రమాదంలో చనిపోతే వారి కుటుంబ లో ఒక్కరికి ఉద్యోగం ఇవ్వాలని గత 15 రోజుల నుండి ఆశలు నిర్వహిస్తున్నారు తక్షణమే ఆశలకు తీపి కబురు చెప్పాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో కరుణ, సునీత, రజిని, సరిత, సుకన్య, సావిత్రి, రమ్య, విజయ, సులోచన, సైదమ్మ,పద్మ, సరస్వతి, యాకమ్మ, యాక లక్ష్మి, సునీత తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులు సత్వరమే పరిష్కరించాలి

- * జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్



మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.అనిల్ కుమార్ అన్ని విభాగాల జిల్లా అధికారులు, తొర్రూరు, మహబూబాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారులు గణేష్, క్రిష్ణవేణి లతో అదేవిధంగా మండల అధికారులతో గూగుల్ మీట్ ద్వారా జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యల పరిష్కారం నిమిత్తం వచ్చిన దరఖాస్తుదారులతో కలెక్టర్ స్వయంగా ఫిర్యాదులు తీసుకొని వారి యొక్క వినతులను సవివరంగా విని సంబంధిత విభాగాల అధికారులకు వెంటనే పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు.ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో పెండింగ్ ఫైళ్లను, ప్రజావాణి దరఖాస్తులను పరిశీలించి తక్షణమే క్లియర్ చేయాలని, కార్యాలయాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రజలకు జవాబుదారీ తనంగా ఉంటూ సేవలు అందించాలని కలెక్టర్ సూచించారు.ప్రత్యేక అధికారులు వారికి కేటాయించిన వసతి గృహాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి పిల్లలతో కలిసి బ్రేక్ ఫాస్ట్ ,భోజనం, డిన్నర్ చేయాలని, ఏమైనా సమస్యలు ఉంటే అక్కడికక్కడే వెంటనే పరిష్కరించాలని తెలిపారు. ఈ సందర్భంగా ఇనుగుర్తి మండలం, చిన్నముప్పారం కు చెందిన గుండ్ల ఉపేందర్ తాను ఎన్నో ఏళ్లుగా తాము సాగు చేసుకుంటున్న భూమి వేరొకరి పేరు మీద పట్టా మార్పు జరిగిందని అట్టి భూమి తిరిగి తన పేరు మేరు మీద మార్పు చేసి పట్టా పాసు పుస్తకము ఇప్పించి న్యాయం చేయాలని కోరారు. గంగారం మండలం, దుబ్బగూడెం గ్రామానికి చెందిన గ్రామస్తులు స్తానికంగా ఉన్న ఫర్టిలైజర్ దుకాణ యజమానులు ఎరువులను ఎక్కువ ధరలకు అమ్ముతున్నారని, అదేవిధంగా తమ గ్రామానికి కేటాయించిన మొక్క జొన్న కొనుగోలు కేంద్రాన్ని వేరే గ్రామానికి తరలించారని తమపై అధిక వడ్డీ వ్యాపారం చేస్తున్నారని, మొక్క జొన్న తక్కువ ధరకు కొనుగోలు చేసి చెల్లిస్తున్నారని అట్టి ఫర్టిలైజర్ యజమానులపై చట్ట రిత్యా చర్యలు తీసుకోవాలని కోరారు.గార్ల మండలం, బాలాజీ తండ కు చెందిన సరోజ తనకు గతంలో ఇందిరమ్మ ఇల్లు వచ్చినట్లు రికార్డులో చూపిస్తుందని కానీ ఇప్పటివరకు తనకు ఇందిరమ్మ ఇల్లు సాంక్షన్ కాలేదని రికార్డులను పరిశీలించి తనకు ఇందిరమ్మ ఇల్లు వచ్చే విధంగా న్యాయం చేయాలని కోరారు.సీరోలు, మండలం సీతా తండ గ్రామ పంచాయతీ అందనాల వీడు కు చెందిన అంగోతు లచ్చు తనకున్న 2.20 ఎకరాలకు 2024 సంవత్సరము నుండి ఇప్పటివరకు తన ఖాతాలో రైతు భరోసా డబ్బులు జమ అవట్లేవని పరిశీలించి తనకు రైతు భరోసా డబ్బులు ఇప్పించగలరని కోరారు.ఈ రోజు నిర్వహించిన ప్రజావాణి లో వచ్చిన (168) దరఖాస్తులను సంబందిత శాఖల అధికారులకు సత్వర పరిష్కారానికి ఆదేశించారు.ఈ ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, జడ్పీ సీఈవో పురుషోత్తం, అన్ని విభాగాల జిల్లా అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్, భాజపాల మధ్య పెట్రో మంట

హైదరాబాద్: తెలంగాణ వ్యాట్ సవరణ బిల్లుపై అధికార కాంగ్రెస్, భాజపాల మధ్య విమర్శలు, ప్రతి విమర్శలు చోటుచేసుకున్నాయి. పెట్రోల్, డీజిల్‌పై కేంద్రం ఎక్సైజ్ డ్యూటీని భారీగా తగ్గించిందని.. తెలంగాణ సర్కారు వ్యాట్ ఎందుకు తగ్గించడం లేదని భాజపా శాసనసభపక్ష ఉపనేత పాయల్ శంకర్ ప్రశ్నించారు. 'పెట్రోల్, డీజిల్‌తో రైతు జీవితం ముడిపడి ఉంది. వీటిని రాష్ట్రంలో జీఎస్టీ పరిధిలోకి తీసుకువస్తే బాగుంటుంది' అని ఆయన అన్నారు. ఈ వ్యాఖ్యలపై మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్‌లు తీవ్రంగా స్పందించారు. ఎన్నికలు జరుగుతున్న నాలుగు రాష్ట్రాల్ని దృష్టిలో పెట్టుకునే కేంద్రం తాత్కాలిక నిర్ణయం తీసుకుందని పొన్నం విమర్శించారు. తగ్గించిన ధరల్ని ఏడాదిపాటు పెంచకుండా ఉంటారా? అని సవాల్ విసిరారు. పాయల్ శంకర్ స్పందిస్తూ.. 'తెలంగాణలో పెట్రోల్ ధర లీటర్‌కు రూ.107.46 ఉంది. ఎన్నికల్లేని రాష్ట్రాలు ఉత్తర్‌ప్రదేశ్‌లో రూ.94.60, దిల్లీలో రూ.94.70, ఉత్తరాఖండ్‌లో రూ.93.40 మాత్రమే ఉంది. కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం కూడా 20% తగ్గించింది కదా?' అని ప్రశ్నించారు.

# ఎంజి యూనివర్సిటీలో విద్యార్థుల ధర్నా

**నిర్మాణ పనుల నిలిపివేత..**



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో యూనివర్సిటీలో జరుగుతున్న నిర్మాణ పనుల వల్ల విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల సోమవారం రిజిస్ట్రార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ధర్నాను ఉద్దేశించి యూనివర్సిటీ ప్రెసిడెంట్ హనుమాన్ మాట్లాడుతూ కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా యూనివర్సిటీ రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయనీ,ముఖ్యంగా రోడ్ల మలుపుల వద్ద కంకర,రాళ్లు,డస్ట్ పేరుకుపోవడంతో వాహనాలు జారి పడుతున్నాయని అన్నారు. దుమ్ము అధికంగా లేవడం వల్ల విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.నాలుగు రోజుల క్రితం ఏఈ ఆఫీస్ ముందు ధర్నా చేసినప్పటికీ యాజమాన్యం స్పందించకపోవడం దురదృష్టకరం అని తెలిపారు. ఈ నిర్లక్ష్యం వల్లనే నిన్న ఇద్దరు విద్యార్థులు బైక్‌పై వెళ్తూ జారి పడిన ఘటన చోటుచేసుకుందని అన్నారు రిజిస్ట్రార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్న సందర్భంలో ఆయన విషయం పట్టించుకున్నప్పటికీ, మా మాటలను పూర్తిగా వినకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిచడం చాలా బాధాకరం అని విమర్శించారు. విద్యార్థుల సమస్యలను సీరియస్‌గా తీసుకోకపోవడం యాజమాన్య వైఫల్యమని అన్నారు.దీనికి నిరసనగా విద్యార్థుల భద్రత దృష్ట్యా నిర్మాణ పనులను తాత్కాలికంగా ఆపివేశామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు సంపత్, అజయ్,సుధీర్,సతీష్ విజయ్, వెంకటేష్, నందు,సాయి తదితర విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

# అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: మహబూబాబాద్ మున్సిపాలిటీ 6వ వార్డు బేతోలు గ్రామం, భజన తండా. అప్పుల బాధతో రైతు గుగులోత్ విజయ్. వయస్సు 48 సం" భార్య బుజ్జి, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మిర్చి నల్లి ద్వారా పంట పాడైంది. వరి, పత్తి, మొక్కజొన్న మూడు ఎకరాలు సొంతం. మూడు ఎకరాలు కౌలుకు తీసుకొని ముగ్గురు పిల్లలతో వ్యవసాయం చేస్తున్నారు.పంటకు పెట్టిన పెట్టుబడి రాకపోవడంతో ఎనిమిది లక్షలు అప్పు అయ్యింది. దాంతో పంట పొలం వద్ద ఉన్న చెట్టుకు ఉరి పెట్టుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

# రేగళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ అంకిత్



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు . సోమవారం రేగళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి అక్కడి వైద్య సేవలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా రోగులకు అందుతున్న వైద్యం, సౌకర్యాలపై రోగులను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రంలోని లాబరేటరీలో నిర్వహిస్తున్న పరీక్షా విధానాన్ని పరిశీలించి, పరీక్షలు నాణ్యతగా నిర్వహించాలని సూచించారు. అలాగే మందుల గిడ్డంగిని తనిఖీ చేసి, అవసరమైన అన్ని రకాల ఔషధాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఆరోగ్య కేంద్రంలో రోజువారీ ఓపీకి ఎంతమంది రోగులు వస్తున్నారో తెలుసుకున్నారు. రక్త పరీక్ష కేంద్రంలో నిర్వహిస్తున్న పరీక్షల వివరాలు, అందుబాటులో ఉన్న టీకాల వివరాలను కూడా అడిగి తెలుసుకున్నారు. అత్యవసర సేవల స్థితిగతులు, అవసరమైన ఔషధాల లభ్యతపై సమగ్రంగా ఆరా తీశారు.రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిరంతర వైద్య సేవలు అందించడంలో వైద్యులు, సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు.ఈ సందర్భంగా కలెక్టర్ కుక్క కాటుకు గురైన ఒక బాలుడిని పరామర్శించి, అతనికి అందిస్తున్న చికిత్సపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ వైద్యం అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకూడదని స్పష్టం చేశారు.ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది షిఫ్ట్‌ల వారీగా క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తూ, ప్రజలకు సమర్థవంతమైన మరియు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.జిల్లాలో వైద్య సేవల మెరుగుదలకు ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని జిల్లా కలెక్టర్ తెలిపారు.ఈ తనిఖీ లో మెడికల్ ఆఫీసర్ స్వప్న టిపిఎంఓ ఫార్మసిస్ట్ స్టాఫ్ నర్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వికారాబాద్ పోలీసుల ఆధ్వర్యంలో అరైవ్ అలైవ్



వికారాబాద్ ప్రజాస్ఫూర్తి : వికారాబాద్ జిల్లా కరణ్‌కోట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సిసిఐ ఫ్యాక్టరీలో భారీ ఉచిత కంటి వైద్య శిబిరం, డ్రగ్స్ నిర్మూలన అవగాహన సదస్సు నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వ ప్రజా పాలనలో భాగంగా, రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా చేపట్టిన "అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ, జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా లు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వాహన చోదకుల ఆరోగ్యం, ముఖ్యంగా కంటి చూపు బాగున్నప్పుడే రోడ్డు ప్రమాదాలను అరికట్టగలమని పేర్కొన్నారు. డ్రైవర్ల అలసట, దృష్టి లోపం వల్లే అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రతి ఒక్కరూ తమ గమ్యస్థానాలకు సురక్షితంగా చేరాలన్నదే ఈ కార్యక్రమ ఉద్దేశమని తెలిపారు. అలాగే, డ్రగ్స్ మహమ్మారి యువత భవిష్యత్తును చిన్నాభిన్నం చేస్తోందని, సమాజ శ్రేయస్సు కోసం ప్రతి ఒక్కరూ డ్రగ్స్ నిర్మూలనలో భాగస్వాములు కావాలని, అనుమానిత సమాచారాన్ని వెంటనే అధికారులకు అందించాలని కోరారు. జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా మాట్లాడుతూ.. రహదారి భద్రత అనేది ప్రతి పౌరుడి బాధ్యత అని, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారానే ప్రాణ నష్టాన్ని నివారించవచ్చని తెలిపారు. కంటి సమస్యలున్న డ్రైవర్ల కోసం ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో పరీక్షల అనంతరం ఉచితంగా మందులు, కళ్లద్దాలు పంపిణీ చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ బి.రాములు నాయక్, డీఎస్పీ నర్సింగ్ యాదయ్య,కరణ్ కోట్ సీఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి, ఎస్.ఐ వినోద్ రాథోడ్, మున్సిపల్ చైర్ పర్సన్ నీరజ బాల్ రెడ్డి, వైస్ చైర్మన్ అబ్దుల్ రజాక్, సర్పంచ్ రాజ్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింలు, సీసీఐ జనరల్ మేనేజర్ సరోజ, ఇతర పోలీస్ అధికారులు, సిసిఐ అధికారులు పాల్గొన్నారు.

## సర్వే చేయకుండానే గ్రామీణ రోడ్ల పనులు

* **అందువల్లే అధిక శాతం అసంపూర్తి**



హైదరాబాద్: తగినంత సన్నాహకం, సర్వేలు నిర్వహించకుండా గ్రామీణ రహదారుల పనులు అప్పగించడం వల్ల అధికశాతం అసంపూర్తిగా ఉండిపోయాయని కాగ్ నివేదిక వెల్లడించింది. రాష్ట్ర ప్రభుత్వం, ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన (పీఎంజీఎస్‌వై) చేపట్టే పనులకు కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ తన వాటాను సకాలంలో విడుదల చేసినా రాష్ట్ర వాటా విడుదలలో జాప్యం వల్ల నిర్మాణాలు ఆలస్యమయ్యాయని పేర్కొంది. ఎక్కువ ప్రమాణాలతో రహదారులు నిర్మించడం ద్వారా వ్యయం అధికమైందని వెల్లడించింది. 2022 మార్చి నాటికి ముగిసిన ఆర్థిక సంవత్సరం కాగ్ నివేదికను సోమవారం రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో ప్రవేశపెట్టింది. రోడ్ల నిర్మాణం తీరుతెన్నుల్లో లోటుపాట్లు, నిధుల వృథాను కాగ్ పేర్కొంది.

* **ఎక్కడా తనిఖీల జాడ లేదు..**

''తెలంగాణ గ్రామీణ రహదారుల నిర్వహణ విధానం 2017 ప్రకారం ఏటా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ వార్షిక గ్రామీణ రహదారుల నిర్వహణ ప్రణాళికను రూపొందించాల్సి ఉన్నా అలా చేయట్లేదు. అనేక రోడ్ల నిర్మాణంలో లోపాలున్నాయి. గ్రామీణ రోడ్ల నిర్మాణం(సీఆర్ఆర్), మరమ్మతులు(ఎంఆర్ఆర్) పథకాల కింద చేపట్టిన 171 పనుల తనిఖీ సందర్భంగా వాటి నివేదికలను అధికారులు ఆడిట్ విభాగానికి ఇవ్వలేదు. పీఎంజీఎస్‌వై మార్గదర్శకాలలో నిర్దేశించిన విధంగా ఇంజనీరింగ్ సిబ్బంది ప్రజాప్రతినిధులతో కలిసి ఆయా రోడ్ల పనుల ఉమ్మడి తనిఖీలు నిర్వహించాల్సి ఉండగా... అది ఎక్కడా జరగలేదు. రహదారుల నిర్వహణ సరిగా ఉండడడంలేదు. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలో పీఎంజీఎస్‌వై కింద రూ.3.22 కోట్లతో రోడ్డు నిర్మించగా దాని అంచు కోతకు గురికావడం, సిమెంట్ కాంక్రీట్ దెబ్బతినడం, నీటి కాలువలు మూసుకుపోవడాన్ని కేంద్ర అధికారులు గుర్తించి నివేదించినా రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. పీఎంజీఎస్‌వై నిధులను ఇతర పనులకు వాడారు. రహదారుల నిర్మాణం నిధులను కార్యాలయాల మరమ్మతులకు ఉపయోగిస్తున్నారు'' అని కాగ్ తెలిపింది.

## న్యాయవాదులపై దాడుల్ని అరికట్టే చట్టమిది!

* **వామన్‌రావు దంపతుల హత్య కేసు నీరుగార్చిన భారాస పెద్దలు**
* **'న్యాయవాదుల పరిరక్షణ బిల్లు' చర్చలో మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం**
* **బిల్లుకు శాసనసభ ఏకగ్రీవ ఆమోదం**



హైదరాబాద్: తెలంగాణ న్యాయవాదుల పరిరక్షణ బిల్లు 2026ను సోమవారం శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు బిల్లు ప్రవేశపెట్టగా.. జరిగిన చర్చలో పలువురు సభ్యులు తమ అభిప్రాయాలు వెలిబుచ్చారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. ''న్యాయవాదులపై దాడులు బాధాకరం. వారి సంరక్షణ మన బాధ్యత. కోర్టుల్లో జరిగే వాదోపవాదాలు, తీర్పులు న్యాయవాద వృత్తిపై ప్రభావం చూపుతున్నాయి. కేసులతో వారికి సంబంధం లేకపోయినా బాధిత పక్షాలు హింసాత్మక దాడులకు పాల్పడుతున్నాయి. న్యాయవాదులకు బెదిరింపులు, హత్యలు, వారు, వారి కుటుంబ సభ్యులపై దాడులకు ఈ చట్టం అడ్డుకట్ట వేస్తుంది. పోలీసు కేసుల్లోనూ అరెస్టు నుంచి రక్షణ కల్పిస్తుంది' అని తెలిపారు. ''2021లో కరీంనగర్ జిల్లా మంథని నియోజకవర్గంలోని రామగిరి మండలంలో న్యాయవాదులు గట్టు వామన్‌రావు, నాగమణిలను నాటి భారాస నాయకుల ప్రోద్బలంతో నడిరోడ్డుపై హత్య చేశారు. ఆ పార్టీ పెద్దల డైరెక్షన్‌లో పోలీసులు కేసును నీరుగార్చారు. ఇంకా సీబీఐ విచారణ కొనసాగుతోంది. ఆ సంఘటన తర్వాత న్యాయవాదులు తమ రక్షణ కోసం ఓ ప్రత్యేక చట్టం కావాలని ఆందోళనలు చేస్తున్నారు. తదనంతరం కూడా ఎంతోమంది న్యాయవాదులు హత్యకు గురయ్యారు' అంటూ బిల్లుకు దారి తీసిన పరిస్థితులు వివరించారు. చర్చలో విపక్ష సభ్యులు చేసిన ఆరోపణలపై స్పందిస్తూ.. తాము సామాజిక న్యాయానికి కట్టుబడి ఉన్నామని.. రాష్ట్రవ్యాప్తంగా 414 మంది పబ్లిక్ ప్రాసిక్యూటర్లలో 126 మంది బీసీ, 59 మంది ఎస్సీ, 25 మంది ఎస్టీలను నియమించామని చెప్పారు. కేంద్రం.. స్టాండింగ్ కౌన్సిళ్లు, ఇతర చోట్ల సామాజిక న్యాయాన్ని పాటించాలని సూచించారు. 18,637 మంది న్యాయవాదులకు ఆరోగ్య కార్డులను రెన్యువల్ చేశామని చెప్పారు.

# జిల్లాలో నమోదైన పలు రకాల కేసులపై సమీక్ష సమావేశం




మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్ ఆధ్వర్యంలో సోమవారం మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ కాన్ఫరెన్స్ హాల్ లో సమగ్ర క్రైమ్ రివ్యూ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో జిల్లాలోని పోలీస్ అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ ప్రతి కేసు ఫైల్‌ను స్వయంగా పరిశీలించి, దర్యాప్తు పురోగతి, సాక్ష్యాధారాల సేకరణ విధానం, సాంకేతిక ఆధారాల వినియోగం, సాక్షుల వాంగ్మూలాల నమోదు వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించారు. దర్యాప్తు నాణ్యతను మరింత మెరుగుపరచడానికి అవసరమైన సూచనలు చేస్తూ, ప్రతి కేసులో చట్టపరమైన విధానాలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. ముఖ్యంగా కేసులలో చార్జ్ షీట్లను పూర్తి స్థాయిలో, లోపాలు లేకుండా, సమయపాలనతో కోర్టులో దాఖలు చేయాలని వివరంగా తెలియజేశారు. చార్జ్ షీట్ తయారీలో ప్రతి అంశం స్పష్టంగా ఉండేలా, సాక్ష్యాధారాలు బలంగా ప్రతిపాదించేలా, కోర్టులో కేసు నిలబడే విధంగా రూపొందించాలన్నారు.గ్రామ స్థాయి నుంచి హెల్మెట్ వాడకం పై అవగాహన పెంచలన్నారు. జిల్లాలో గంజాయి వినియోగం, యువత పై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ ఆదేశించారు. గంజాయి తాగేవారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, ఇలాంటి కార్యకలాపాలను పూర్తిగా నిర్మూలించేందుకు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని సూచించారు. నైట్ పట్రోలింగ్ ను మరింత బలోపేతం చేయాలని, ప్రతి సర్కిల్‌లో సీఐలు, ఎస్ఐలు స్వయంగా రాత్రి సమయంలో గ్రామాలను సందర్శిస్తూ పరిస్థితులను పర్యవేక్షించాలని ఆదేశించారు. డీఎస్పీలు కూడా తరచూ రాత్రి పర్యటనలు నిర్వహించి పోలీస్ వ్యవస్థ పనితీరును సమీక్షించాలని సూచించారు. ప్రజల్లో భద్రతాభావం పెంపొందించే దిశగా పట్రోలింగ్‌ను సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. సమావేశం అనంతరం, ఇటీవల మూడు కేసుల్లో నిందితులకు శిక్షలు విధించబడేలా కృషి చేసిన సీడీఓలు, సంబంధిత పోలీస్ అధికారులను ఎస్పీ డా. శబరీష్ అభినందించి, ప్రశంసా పత్రాలను అందజేశారు.

## ప్రజల సౌకర్యార్థం.. వలిగొండ రోడ్డు నిర్మాణ పనులు వేగవంతం

: **చౌటుప్పల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్**






చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ పట్టణ ప్రజల రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా, వలిగొండ రోడ్డు అభివృద్ధి పనులను అత్యంత ప్రాధాన్యతతో పూర్తి చేస్తామని చౌటుప్పల్ మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి మొగుదాల పావని రమేష్ గౌడ్ అన్నారు. గత కొంతకాలంగా వలిగొండ రోడ్డు గుంతలతో అస్తవ్యస్తంగా మారి, వాహనదారులు, స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టిలో ఉంచుకుని, చైర్‌పర్సన్ ఆదేశాల మేరకు కమిషనర్ జి. వెంకట్రాం రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం రోడ్డు మరమ్మతు పనులు (ప్యాచ్ వర్క్) చేపట్టారు. రాకపోకలకు అనువుగా మట్టిని జెసిపి తో చదును చేయించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ మాట్లాడుతూ మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఆర్ అండ్ బి శాఖ ఇంజనీర్లతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని, సాంకేతిక ఆటంకాలను త్వరితగతిన పరిష్కరించి శాశ్వత రోడ్డు నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. చిన్నచిన్న అడ్డంకులను తొలగించి, సాధ్యమైనంత త్వరగా ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాన్ని అందుబాటులోకి తెస్తామని స్పష్టం చేశారు. పట్టణ ప్రజల సౌలభ్యం కోసం మున్సిపల్ యంత్రాంగం నిరంతరం అందుబాటులో ఉంటుందని, అభివృద్ధి పనుల్లో ప్రజలందరూ సహకరించాలని కోరారు.

## మసకబారుతున్న జిల్లా ప్రభుత్వ వైద్యశాల భవనం

- **జిల్లా ఆస్పత్రిలో రోగులపై సిబ్బంది దురుసు ప్రవర్తన**
- **అర్హత లేని వారితో విధులు**
- **సిబ్బంది కొరత అంటూ బుకాయింపు**
- **వైద్య కళాశాల విద్యార్థుల నిర్లక్ష్య ధోరణి**







ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలోని చర్ల, ఇల్లందు వంటి రిమోట్ ఏరియాల్లో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు మెరుగైన సేవలు అందిస్తూ రాష్ట్ర మంత్రుల నుంచి ప్రశంసలు అందుకుంటూ ప్రభుత్వ ఆస్పత్రుల ప్రాభవాన్ని చాటుతుంటే... జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యంతో ఆ గొప్పతనం మసకబారిపోతుందని పలువురు రోగులు విమర్శిస్తున్నారు. ఇటీవల ప్రభుత్వాస్పత్రుల్లో సౌకర్యాలు మెరుగుపర్చామని ప్రచారం చేస్తుండటంతో ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లలేని ప్రజలంతా ప్రభుత్వాస్పత్రికే వచ్చి వైద్యం చేయించుకుంటున్నారు. అంతేకాక ప్రభుత్వాస్పత్రుల పనితీరుపై పత్రికలు, టీవీ ఛానళ్లు, సోషల్ మీడియాలో వస్తున్న కథనాలు చూసి ఆకర్షితులవుతున్నారు. అయితే ఆస్పత్రికి వచ్చి చూస్తే జరుగుతున్న ప్రచారానికి, వాస్తవ పరిస్థితులు చాలా భిన్నంగా ఉన్నాయని వాపోతున్నారు. ఆస్పత్రి ప్రాంగణంలో పేరుకుపోతున్న పారిశుధ్యం నుంచి మొదలుకొని సిబ్బంది నిర్లక్ష్యం వరకు అడుగడుగునా రోగులకు తిప్పలు తప్పడంలేదని అంటున్నారు. వార్డుల్లో ఉండాలంటే దుర్వాసనతో ముక్కులు మూసుకోవాల్సిన పరిస్థితులు ఉన్నాయని, పేరుకుపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయకుండా వదిలేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

* **విధి నిర్వహణలో అనర్హులకు పనులు అప్పగింత...**

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిలో అర్హత లేని వారితో పనులు చేయిస్తున్నట్లు రోగులు ఆరోపిస్తున్నారు. చిట్టీలు రాసే దగ్గరి నుంచి అటెండర్, ఎక్స్‌రే గది, రక్త పరీక్ష కేంద్రం, డాక్టర్ గదులు తదితర ప్రాంతాల్లో రోగులతో దురుసుగా ప్రవర్తించడం, ప్రశ్నిస్తే నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడం, సెల్‌ఫోన్లలో టైంపాస్ చేయడం వంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయని బాధితులు చెబుతున్నారు. డాక్టర్లు రాసిన స్లిప్పులను కూడా చదవలేకపోతున్నారని, అలాంటి వారికి విధులు కేటాయించడమేంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. దీంతో రేడియాలజీ హబ్‌లో గందరగోళం నెలకొంది. అదేవిధంగా అటెండర్లు రోగుల వివరాలు నమోదు చేస్తూ కన్పిస్తున్నారని రోగుల బంధువులు చెప్తున్నారు.

* **అసౌకర్యాలతో రోగుల ఇబ్బందులు**

కొన్ని వార్డుల్లో ఏసీలు పనిచేయకపోవడంతో ఆపరేషన్ జరిగిన రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో పరిస్థితి మరింత విషమించే అవకాశముంది. వార్డులకు అనుబంధంగా ఉన్న మరుగుదొడ్లలో మద్యం బాటిళ్లు, గుట్కా ప్యాకెట్లు ఉండటంతో రోగులు మరింత ఆందోళనకు గురవుతున్నారు. ఎమర్జెన్సీ బ్లాక్‌పై చెత్త పేరుకుపోయి కన్పిస్తోంది. వీల్‌చైర్లు సరిపడా లేకపోవడంతో నడవలేని రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఆసుపత్రిలో ఎక్స్‌రే గది ఉన్నప్పటికీ రోగులను బయట రేడియాలజీ కేంద్రాలకు పంపించడం చర్చనీయాంశంగా మారింది. జిల్లా ఆస్పత్రిపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని రోగులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వాసుపత్రుల్లో సేవల మెరుగుదలకు తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## శాసనమండలిలో భారాస ఆందోళన.. సస్పెన్షన్



హైదరాబాద్: శాసనమండలి సోమవారం భారాస ఎమ్మెల్సీల ఆందోళనల మధ్య ప్రారంభమైంది. భారాస సభ్యులు వెల్‌లోకి దూసుకొచ్చి ఛైర్మన్ పోడియం వద్ద ప్లకార్డులు పట్టుకుని నిరసనకు దిగారు. మంత్రిమండలి నుంచి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని బర్తరఫ్ చేయాలని, రాఘవ కన్‌స్ట్రక్షన్ అక్రమ మైనింగ్‌పై హౌస్ కమిటీ వేయాలని నినాదాలు చేశారు. టేబుళ్లపై ఉన్న పేపర్లు, బడ్జెట్ పుస్తకాలను చింపి వేసి ఛైర్మన్ పోడియం వైపు విసిరారు. దీంతో మార్షల్స్ వారిని అడ్డుకోవడంతో ఇరువురి మధ్య తోపులాట జరిగింది. ఈ గందరగోళం మధ్యలోనే 'ది తెలంగాణ ఎంప్లాయీస్ ఎకౌంటబిలిటీ అండ్ మానిటరింగ్ ఆఫ్ పేరెంటల్ సపోర్ట్ చట్టం2026' బిల్లును మంత్రి అడ్లూరి లక్ష్మణ్ సభలో ప్రవేశపెట్టారు. భారాస ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాసరెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి సభలోని సీట్లపైకెక్కి నిరసన తెలిపారు. ఇది పెద్దల సభ అని, ఆందోళన విరమించి సీట్లలో కూర్చోవాలని మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి పదేపదే విజ్ఞప్తి చేశారు. ఈ తరుణంలో శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు జోక్యం చేసుకుని సభ నిర్వహణలో మండలి ఛైర్మన్‌కు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. 'భారాస సభ్యుల అప్రజాస్వామిక తీరు సరికాదు. 2014 నుంచి జరిగిన మైనింగ్ అక్రమాలపై సీబీసీఐడీతో విచారణ చేయిస్తాం. హౌస్ కమిటీ పేరుతో మండలిలో రాజకీయం చేయడం సరికాదు. 201418 మధ్య భారాస ప్రభుత్వం మూడు హౌస్ కమిటీలను వేసింది. అవి సక్రమంగా సమావేశాలు నిర్వహించలేదు, నివేదికలు బయటకు ఇవ్వలేదు. పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన భారాసకు సీబీసీఐడీపై నమ్మకం లేకపోవడం శోచనీయం' అని పేర్కొన్నారు. భారాస సభ్యుల తీరుపై మంత్రి అజారుద్దీన్, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ సైతం అభ్యంతరం తెలిపారు.

## జగద్గిరిగుట్టలో ఉద్యమకారుల అరెస్టు



ఉద్యమకారులకు కాంగ్రెస్ ఇచ్చి నటువంటి హామీ నెరవేర్చలన్న డిమాండ్ తో ఆందోళన చేయనున్న ఉద్యమకారులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు.ప్రభుత్వం వచ్చి రెండున్నార సంవత్సరాలు అయినా ఉద్యమకారులకు ఇచ్చిన 250చదరపు గజాల స్థలం హామీ నెరవేర్చలేదని అసెంబ్లీ ముట్టడికి జేఏసీ పిలుపు ఇచ్చారు. అందులో బాగంగా జగద్గిరిగుట్ట కు చెందిన ఉద్యమకారులు రుద్ర అశోక్, వేణు యాదవ్ లను పోలీసులు ఇంటికి వచ్చి అరెస్టు చేసి పోలీసు స్టేషన్ కి తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమను అక్రమంగా అరెస్టు చేశారాని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ని నెరవేర్చలంటే అరెస్టు చేస్తారా అని ప్రశ్నించారు. తమ ఆందోళన ఆగదని స్పష్టం చేశారు.

## 83,545 మంది అనర్హులకు రేషన్ బియ్యం!



హైదరాబాద్: పేదల ఆహార భద్రత కోసం అమలుచేస్తున్న రేషన్ పథకం అమలులో కీలక లోపాలు 'కాగ్' పరిశీలనలో వెలుగుచూశాయి. ఆదాయ పన్ను చెల్లింపుదారులు, అధిక విస్తీర్ణంలో వ్యవసాయ భూములు కలిగిన వారు సైతం రేషన్ లబ్ధి పొందుతున్నట్లు వెల్లడైంది. ''అనర్హులతో పాటు మరణించిన లబ్ధిదారులతో కలిపి 83,545 మందికి రేషన్ బియ్యం ఇస్తున్నారు. ఇందుకోసం నిబంధనలకు విరుద్ధంగా రూ.135.16 కోట్ల వ్యయం చేశారు. ప్రధానమంత్రి కిసాన్ డేటా 202021 ప్రకారం ఇందులో 52,339 మంది ఆదాయ పన్ను చెల్లింపుదారులుగా ఉన్నారు. 5,886 మందికి 15 ఎకరాల కంటే అధిక భూమి ఉంది. వీరికి రైతుబంధు పథకం ద్వారానే ఏడాదికి రూ.1.5 లక్షలకు మించి అందింది. 2020 21లో 16,128 కేసులు.. 202122లో 25,320 కేసుల్లో లబ్ధిదారులు మరణించినప్పటికీ వారి పేరుతో రేషన్ తీసుకుంటూనే ఉన్నారు. అనర్హులు రాయితీ బియ్యం తీసుకున్న కేసుల్ని ప్రభుత్వం దర్యాప్తుచేసి లోపాలకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలి'' అని కాగ్ సిఫార్సు చేసింది.

## నిర్మాణ రంగ బోర్డులో నిధుల దుర్వినియోగం

* **తప్పుడు రిజిస్ట్రేషన్లతో బోగస్ క్లెయిమ్‌ల చెల్లింపు**
* **'కాగ్' నివేదిక**



హైదరాబాద్: భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలను బోర్డు సమర్థంగా అమలు చేయలేదని.. నిధుల దుర్వినియోగం జరిగిందని 'కాగ్' పేర్కొంది. ఈ మేరకు భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమ బోర్డుపై 2022 మార్చి 31 నాటికి ఆడిట్ నివేదిక వెలువరించింది. లబ్ధిదారుల నమోదులో 'ఆధార్' అనుసంధానం చేయకపోవడంతో రెండుసార్లు రిజిస్ట్రేషన్‌తోపాటు బోగస్ చెల్లింపులు జరిగాయని పేర్కొంది. కొన్ని కేసుల్లో కార్మికుడు చనిపోయిన తేదీ తర్వాత రిజిస్ట్రేషన్ చేయడం, తప్పుడు మరణ ధ్రువీకరణలతో క్లెయిమ్‌లు చేసినట్లు గుర్తించింది. నిర్మాణ సంస్థలు బోర్డుకు చెల్లించాల్సిన సెస్ ఎగవేసినట్లు గుర్తించినప్పటికీ సరైన చర్యలు లేకపోవడంతో రూ.311.32 కోట్లు రికవరీ చేయలేకపోయినట్లు తెలిపింది. కరోనా సమయంలో కార్మికులకు ఆర్థికసాయం, బియ్యం పంపిణీకి రెండు విడతల్లో రూ.1,004.82 కోట్లు బోర్డు ప్రభుత్వానికి జమ చేయగా.. ఇందులో రూ.258.04 కోట్లు వెచ్చించారు. మిగతా నిధులు (రూ.746.78 కోట్లు) 2023 జనవరి వరకు పౌరసరఫరాలశాఖ బోర్డుకు తిరిగి చెల్లించలేదని వివరించింది. ప్రభుత్వం కొన్ని పనులకు గుత్తేదారుల నుంచి కార్మిక సెస్ మినహాయించడానికి బదులుగా ప్రభుత్వమే అంచనాల్లో కార్మిక సెస్ కలిపి గుత్తేదారులకు లబ్ధి చేకూర్చినట్లు పేర్కొంది.

**నివేదికలోని ముఖ్యాంశాలు..**

హనుమకొండ, హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, రంగారెడ్డి జిల్లాల్లో మున్సిపాలిటీలు 201722 కాలంలో రూ.164.25 కోట్ల సెస్ వసూలు చేయగా.. కేవలం రూ.59.86 కోట్లు మాత్రమే బోర్డుకు జమ చేశాయి. రాష్ట్రంలో నమోదైన 14.83 లక్షల మంది కార్మికుల్లో 3.34 లక్షల మంది నమోదు రెన్యువల్ చేసుకోకపోవడంతో సంక్షేమ పథకాల అర్హత కోల్పోతున్నారు. బోర్డుకు వచ్చిన దరఖాస్తుల్లో 48,894 మందికి గుర్తింపు కార్డులు జారీ చేయలేదు. బోర్డు 201920, 202021 సంవత్సరాలకు బడ్జెట్ తయారు చేయలేదు.

# 'నక్సల్స్ రహిత భారత్'.. డెడ్‌లైన్ ముంగిట అమిత్ షా ప్రకటన


మావోయిస్టుల పొలిట్‌బ్యూరో, కేంద్ర వ్యవస్థను దాదాపు తుడిచిపెట్టేశామని.. దీంతో నక్సల్స్ ముప్పు నుంచి దేశం విముక్తి పొందిందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. మావోయిస్టులకు ఒకప్పుడు కంచుకోటగా ఉన్న ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్‌లో నక్సలిజం దాదాపు అంతమైందన్నారు. నక్సలిజం నిర్మూలన చర్యలపై సోమవారం ఆయన లోక్‌సభలో మాట్లాడారు. "ఈ ఏడాది మార్చి 31 నాటికి నక్సల్స్ రహిత భారతాన్ని సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. ఈ ప్రక్రియ మొత్తం అధికారికంగా పూర్తయిన తర్వాత దేశానికి తెలియజేస్తాం. అయితే, మన దేశం నక్సల్స్ రహితంగా మారిందని చెప్పగలను" అని అన్నారు. మావోయిస్టుల సుదీర్ఘ హింసాకాండకు ముగింపు పలికేందుకు కాంగ్రెస్ పార్టీ ఏమీ చేయలేదని అమిత్ షా విమర్శించారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ నక్సల్ సానుభూతిపరులతో కలిసి బహిరంగంగా పలుమార్లు కనిపించారని, తన సోషల్ మీడియా



ఖాతా నుంచి మావోయిస్టులకు సానుభూతి తెలిపే వీడియోలను కూడా పోస్ట్ చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ సుదీర్ఘ కాలం అధికారంలో ఉన్నా.. ఆదివాసీల జీవితాల్లో మార్పు రాలేదన్నారు. నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో అభివృద్ధి ఎందుకు సాధించలేదని ప్రశ్నించారు. మావోయిస్టులు సమాంతర ప్రభుత్వాన్ని నడిపారని, అభివృద్ధిని అడ్డుకున్నారని, ప్రజలను ఓటు వేయకుండా నిరోధించారని చెప్పారు. సమాజంలో అన్యాయాలకు పరిష్కార మార్గాలు రాజ్యాంగంలో ఉన్నాయని, ఆయుధాలు చేపట్టడం సరైన మార్గం కాదని అమిత్ షా చెప్పారు. చర్చల ద్వారా సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఆయుధాలు పట్టుకుంటే మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని నక్సలిజాన్ని సమర్థించే వారు తెలుసుకోవాలన్నారు. ఎన్డీయే వచ్చాకే గిరిజనుల జీవితాల్లో మార్పులు వచ్చాయని చెప్పారు. నక్సలిజాన్ని దెబ్బతీసిన ఘనత ప్రధానంగా కేంద్ర, రాష్ట్ర బలగాలకే దక్కుతుందన్నారు. ఈ ఏడాది మార్చి 31 నాటికి దేశంలో నక్సలిజాన్ని తుడిచిపెడతామని కేంద్రం ప్రకటిస్తూ వస్తోన్న విషయం తెలిసిందే. ఈ డెడ్‌లైన్ సమీపించిన వేళ అమిత్ షా ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది.

## 75 ఏళ్ల మహిళలు..
# 59, 39 ఏళ్ల భర్తలకు విడాకులు

హిమాచల్‌ప్రదేశ్‌లోని శిమ్లాలో ఆసక్తికర విడాకుల కేసులు వెలుగుచూశాయి. రెండు కేసుల్లోనూ మహిళల వయసు 75 ఏళ్లు కావడం గమనార్హం. ఇద్దరు భర్తలు కూడా వారి భార్యల కంటే తక్కువ వయసు ఉన్నవారే. పైగా.. రెండు జంటలూ కోర్టు ముందు పరస్పర అంగీకారంతో విడాకులు తీసుకున్నాయి. మొదటి కేసులో మహిళ, ఆమె భర్త (59).. 1990లో వివాహం చేసుకున్నారు. సంతానం లేదు. కోర్టుకు సమర్పించిన వివరాల ఆధారంగా.. ఇద్దరి మధ్య అనేక ఏళ్లుగా విభేదాలు



కొనసాగుతున్నాయి. 2010 తర్వాత దూరంగా ఉంటున్నారు. సయోధ్య కోసం అనేక ప్రయత్నాలు చేసినప్పటికీ.. ఫలితం లేకపోవడంతో, చివరకు విడిపోవాలని నిర్ణయించుకున్నారు. ఆమెకు ప్రతి నెలా రూ.5 వేల భరణంతోపాటు గృహవసతి, వైద్య ఖర్చులు భరించేందుకు భర్త అంగీకరించారు. రెండో కేసులో.. 39 ఏళ్ల భర్త నుంచి మహిళ విడిపోయారు. 2008లో ఇద్దరు పెళ్లి చేసుకోగా.. ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఇద్దరి మధ్య పొరపొచ్చాలు రావడంతో.. 2021 నుంచి వేర్వేరుగా ఉంటున్నారు. సామరస్యంగా విడిపోవాలని కోరుకుంటున్నట్లు ఇరువురు కోర్టు విచారణ సందర్భంగా తెలిపారు. ముగ్గురు పిల్లలు వారి తండ్రితోనే నివసించేందుకు అంగీకరించారు. అయితే, పిల్లలను తల్లితో కలిసేందుకు అనుమతిస్తానని కోర్టుకు భర్త హామీ ఇచ్చారు.

# భారత్‌కు రావాల్సిన 19 ఇంధన నౌకలు.. ఇంకా హర్మ్యూజ్ వద్దే!

ముడి చమురు, ఎల్పీజీ, ఎల్ఎన్‌జీ లోడ్‌తో హర్మ్యూజ్ జలసంధి మీదుగా భారత్‌కు అడపాదడపా నౌకలు వస్తున్నాయి. ఇంకా మన దేశానికి రావాల్సిన ఇటువంటి దాదాపు 19 నౌకలు ప్రస్తుతం హర్ముజ్ జలసంధి ప్రాంతంలో చిక్కుకుపోయాయి. పశ్చిమాసియా పరిస్థితులపై ఓడరేవులు, నౌకా రవాణా, జలమార్గాల శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేశ్ కుమార్ సిన్హా మీడియాతో మాట్లాడుతూ.. ఈ వివరాలు వెల్లడించారు. "భారత్ కోసం ఇంధనాన్ని తరలిస్తున్న పది నౌకలు విదేశీ జెండాలు, మిగతావి భారత్ జెండాలతో ప్రయాణిస్తున్నాయి. వీటిలో ఆరు ఎల్పీజీ, ఎనిమిది ముడిచమురు, నాలుగు ఎల్ఎన్‌జీ ట్యాంకర్లు ఉన్నాయి. ఓ ఖాళీ ట్యాంకర్‌లో ఎల్పీజీ లోడింగ్ జరుగుతోంది" అని రాజేశ్ కుమార్ సిన్హా వెల్లడించారు. ఇప్పటివరకు భారత జెండాతో ఎనిమిది నౌకలు సురక్షితంగా హర్మ్యూజ్ దాటి వచ్చాయన్నారు. వీటిలో రెండు ఎల్పీజీ నౌకలు గత రెండు రోజుల్లో హర్మ్యూజ్‌ను దాటాయని చెప్పారు. ఇవి రెండు కలిపి 94 వేల టన్నుల ఎల్పీజీని తీసుకొస్తున్నాయని, ఈ నెల 31న ఓ నౌక ముంబయికి, ఏప్రిల్ 1న మరొకటి న్యూ మంగళూరుకు చేరుకునే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతానికి భారత జెండా కలిగిన నౌకలను స్వదేశానికి తీసుకురావడానికే ప్రాధాన్యం ఇస్తున్నట్లు రాజేశ్ కుమార్ సిన్హా తెలిపారు. ఆ నౌకలను రీఫిల్ కోసం మళ్లీ పంపే దశకు ఇంకా చేరుకోలేదని చెప్పారు.




పశ్చిమాసియా పరిస్థితులను.. ముఖ్యంగా నౌకల రాకపోకలు, సిబ్బంది భద్రత, ఓడ రేవుల కార్యకలాపాలను నిశితంగా పరిశీలిస్తున్నట్లు చెప్పారు.

# తమిళనాడు ఎన్నికలు.. స్టాలిన్, విజయ్ నామినేషన్లు





తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గర పడుతోంది. ఈ క్రమంలోనే ప్రచారం, నామినేషన్ల పర్వం జోరందుకుంది. తాజాగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, డీఎంకే నేత నామినేషన్ దాఖలు చేశారు. అటు టీవీకే అధినేత, నటుడు విజయ్ కూడా నామినేషన్ సమర్పించారు. వరుసగా మూడు సార్లు కొలతూరు నియోజక వర్గం నుంచి గెలుపొందిన స్టాలిన్ మరోసారి అక్కడ నుంచే తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమయ్యారు. నామినేషన్ పత్రాలు సమర్పించిన అనంతరం.. సీఎం రోడ్ షో నిర్వహించారు. "దిల్లీకి వ్యతిరేకంగా తమిళనాడు పోరాడుతోంది. ఈసారి గొప్ప విజయాన్ని అందుకోబోతున్నాం" అని స్టాలిన్ పేర్కొన్నారు. ఇక, తమిళగ వెట్రి కళగం అధినేత, నటుడు విజయ్ ఈ ఎన్నికల్లో రెండు అసెంబ్లీ స్థానాల నుంచి పోటీ చేస్తోన్న సంగతి తెలిసిందే.. పెరంబూర్, తూర్పు తిరుచ్చి నుంచి బరిలో దిగుతున్నారు. తాజాగా పెరంబూర్ స్థానంలో నామినేషన్ దాఖలు చేశారు. ఆయనను చూసేందుకు అభిమానులు, పార్టీ నాయకులు పెద్దఎత్తున వచ్చారు. "నేను ఎంపిక చేసిన వారు కేవలం ఎన్నికల్లో పాల్గొనే అభ్యర్థులు మాత్రమే కాదు. ప్రజల రక్షకులు కూడా. వారికి మీ మద్దతు ఇవ్వాలని అభ్యర్థిస్తున్నా" అని విజయ్ కోరారు. 234 శాసనసభ స్థానాలున్న తమిళనాడులో ఏప్రిల్ 23న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. ఈ ఎన్నికల్లో డీఎంకే 164 స్థానాల్లో బరిలో దిగుతోంది. మరో 70 స్థానాలను కాంగ్రెస్ సహా తమ మిత్రపక్షాలకు కేటాయించింది. అటు టీవీకే అన్ని స్థానాల్లో పోటీ చేస్తోంది. ఇప్పటికే పలు పార్టీలు తొలి విడత అభ్యర్థుల జాబితాలను విడుదల చేశాయి.




## అమెరికా విమానాలకు
# గగనతలాన్ని మూసేసిన స్పెయిన్

అమెరికా విమానాలకు తమ గగనతలాన్ని మూసివేస్తున్నట్లు స్పెయిన్ ప్రకటించింది. ఇరాన్‌తో జరుగుతోన్న యుద్ధంలో పాలుపంచుకొనే విమానాలను అనుమతించమని ఆ దేశ రక్షణ మంత్రి మార్గరెటా రొబెల్స్ సోమవారం వెల్లడించారు. ఇరు దేశాలు సంయుక్తంగా నిర్వహిస్తోన్న సైనిక స్థావరాలను పశ్చిమాసియా ఘర్షణల కోసం వినియోగించడాన్ని ఇప్పటికే స్పెయిన్ నిరాకరించింది. "ఇరాన్ యుద్ధానికి సంబంధించిన కార్యకలాపాల కోసం మిలిటరీ స్థావరాలు లేక గగనతలాన్ని వినియోగించడానికి అనుమతి ఇవ్వబోం. ఏకపక్షంగా, అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధంగా ప్రారంభించిన యుద్ధంలో సహకరించకూడదని మా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దానిలో భాగంగానే తాజా ప్రకటన వచ్చింది" అని రక్షణ, ఆర్థిక మంత్రులు స్థానిక మీడియాకు వెల్లడించారు. ఇరాన్ పై అమెరికాఇజ్రాయెల్ చేస్తోన్న యుద్ధాన్ని స్పెయిన్ ప్రధాని పెడ్రో సాంచెజ్ తొలి నుంచీ వ్యతిరేకిస్తున్నారు. అందుకే ఈ దేశంపై ట్రంప్ ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఆ దేశంతో వాణిజ్యాన్ని నిలిపేస్తామని హెచ్చరించారు.

# లష్కరే తయ్యిబా ఉగ్రవాది షబ్బీర్ అహ్మద్ లోన్ అరెస్ట్

భారత్‌లో దాడులకు కుట్ర పన్నినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న లష్కరే తయ్యిబా ఆపరేటివ్ షబ్బీర్ అహ్మద్ లోన్‌ను అరెస్టు చేసినట్లు సోమవారం అధికారులు వెల్లడించారు. దిల్లీ సమీపంలో అతడిని అదుపులోకి తీసుకున్నామని పోలీసులు తెలిపారు. షబ్బీర్‌ది జమ్మూకశ్మీర్‌లోని శ్రీనగర్ జిల్లా. బంగ్లాదేశ్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నాడు. పాకిస్థాన్ ఐఎస్ఐ ఆదేశాల మేరకు లష్కరే తరఫున భారత వ్యతిరేక కార్యకలాపాలు నడుపుతున్నాడు. అందుకోసం భారత్‌లో చట్టవిరుద్ధంగా నివసిస్తోన్న బంగ్లా జాతీయులను



నియమించుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. పాక్ పేరు బయటకు రాకుండా ఉండేందుకే ఈ ఎత్తుగడ వేసినట్లు అధికారులు వెల్లడించారు. ఆ క్రమంలో దిల్లీ పోలీసు విభాగానికి చెందిన స్పెషల్ సెల్ అధికారులు 2007లో లోన్‌ను అరెస్టు చేశారు. అప్పుడు అతడి నుంచి భారీగా ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. 26/11 మాస్టర్‌మైండ్ హఫీజ్ సయీద్‌తో సంబంధాలున్నాయని గుర్తించారు. 2018 వరకు తిహాడ్ జైల్లో ఉన్న అతడికి బెయిల్ లభించడంతో బయటకు వచ్చాడు. తర్వాత మళ్లీ బంగ్లాకు వెళ్లిపోయాడు. మళ్లీ తన లష్కరే నెట్‌వర్క్‌ను పునర్నిర్మించాడు. అతడి కార్యకలాపాలపై నిఘా ఉంచిన అధికారులు తాజాగా అరెస్టు చేశారు.

# సాగర గర్భంలో సూపర్ కారు!

* **అత్యంత వేగవంతమైన మినీ జలాంతర్గామి సిద్ధం**


రోడ్లపై తిరిగే కార్లను చూశాం! అదేరీతిలో నీటి అడుగున ప్రయాణించడానికి ఒక 'సూపర్ కారు' సిద్ధమైంది. ఇది ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన సబ్‌మెర్సిబుల్ (మినీ జలాంతర్గామి)గా గుర్తింపు పొందింది.. సాగర గర్భంలోని అద్భుతాలను వీక్షించడానికి, పగడపు దిబ్బలు వంటి సహజసిద్ధ వ్యవస్థలను పర్యవేక్షించడానికి ఇది ఉపయోగపడుతుంది.

**ఏమిటీ సబ్‌మెర్సిబుల్?**

నీటి అడుగున సంచరించే వాహనాల తయారీలో రెండు దశాబ్దాలకుపైగా అనుభవమున్న యూ బోట్ అనే డచ్ కంపెనీ ఈ సబ్‌మెర్సిబుల్‌ను నిర్మించింది. దీని ధర 57.5 లక్షల డాలర్లు. దీన్ని అండర్‌వాటర్ సూపర్ కారుగా అభివర్ణిస్తున్నారు. వేగంతోపాటు ప్రయాణికులకు విలాసవంతమైన సౌకర్యాలు ఉండేలా దీన్ని రూపొందించారు.

* **ఈ జలాంతర వాహనంలో పైలట్ సహా ముగ్గురు ప్రయాణించొచ్చు.**

ఇది గంటకు 18.5 కిలోమీటర్ల వేగంతో పయనిస్తుంది. తద్వారా ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన సబ్‌మెర్సిబుల్‌గా ఇది నిలిచింది. డాల్ఫిన్లు కూడా దాదాపుగా ఇంతే



వేగంతో పయనిస్తాయి. ఈ తరహా చిన్నపాటి జలాంతర్గాములు చాలావరకూ గరిష్ఠంగా గంటకు 7 కిలోమీటర్ల వేగాన్ని మాత్రమే కలిగి ఉన్నాయి. ఈ మినీ జలాంతర్గామి.. నీటి ఉపరితలం నుంచి 300 మీటర్ల లోతు వరకూ వెళ్లగలదు. నీటిలో 45 డిగ్రీల కోణంలో పైకి, కిందకి ఇది ప్రయాణించగలదు. ఈ వెసులుబాటు వల్ల అది సంక్లిష్టమైన జలాల్లో సులువుగా పయనించగలుగుతుంది. సంప్రదాయ సబ్‌మెర్సిబుళ్ల కన్నా మెరుగైన నియంత్రణను కలిగి ఉంటుంది. హైడ్రోడైనమిక్ డిజైన్, అధునాతన చోదక వ్యవస్థ కారణంగా ఇది సాఫీగా, వేగంగా ప్రయాణించగలుగుతుంది. ఈ సబ్‌మెర్సిబుల్‌లోని షార్క్ కంట్రోలర్.. హైడ్రోఫాయిల్స్, థ్రస్టర్లతో అనుసంధానమై ఉంటుంది. దీనివల్ల ప్రయాణంలో కచ్చితత్వం, ఒడుపు సాధ్యమవుతున్నాయి. ఈ సబ్‌మెర్సిబుల్‌లోని వైడ్ యాంగిల్ సోనార్ వ్యవస్థ సముద్రగర్భాన్ని స్కాన్ చేసి, మార్గనిర్దేశం చేస్తుంది.

# గ్యాస్, పెట్రోల్ కొరత.. ఇక 'కిరోసిన్' పంపిణీ

పశ్చిమాసియా ఉద్రిక్తతలు మన వంట గదిలోనూ మంట పెట్టాయి. హర్మ్యూజ్ జలసంధిలో చమురు రవాణాకు అంతరాయం ఏర్పడటంతో దేశంలో గ్యాస్, ఇంధనాల కొరత నానాటికీ తీవ్రమవుతోంది. దీంతో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. వంట గ్యాస్ సమస్య తగ్గించేందుకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టింది. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అన్ని రాష్ట్రాలకు సుపీరియర్ కిరోసిన్ (Kerosene) పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు చమురు మంత్రిత్వశాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. 21 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఈ పంపిణీ చేయాలని కేంద్రం నిర్ణయించింది. కేవలం వంట, దీపాలు వెలిగించడం కోసమే షరతులకు లోబడి ఈ పంపిణీని చేపట్టనున్నట్లు కేంద్రం తెలిపింది. దీంతో పాటు లైసెన్స్ పొందిన సర్వీస్ స్టేషన్‌లలో 2,500 లీటర్ల వరకు కిరోసిన్ నిల్వ చేసుకునేందుకు వెసులుబాటు కల్పించింది. 60 రోజుల పాటు లేదా తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు ఈ ఆదేశాలు అమల్లో ఉంటాయని కేంద్రం తెలిపింది. సుపీరియర్ కిరోసిన్ ఆయిల్ అనేది ముడిచమురు రిఫైనరీ ప్రక్రియ నుంచి వచ్చే ఉప ఉత్పత్తి. ఇది అత్యంత శుద్ధి చేసిన కిరోసిన్. దీన్ని



ప్రధానంగా వంటకు, దీపాలు వెలిగించేందుకు వినియోగిస్తారు. సాధారణ లోగ్రేడ్ కిరోసిన్‌తో పోలిస్తే ఇందులోనుంచి వెలువడే వాయువులు తక్కువ. పొగ కూడా తక్కువగా వెలువడుతుంది.

# ఆర్థిక సంవత్సరం చివరి రోజున... కుప్పకూలిన స్టాక్ మార్కెట్లు



**ముంబై:** ఈ ఆర్థిక సంవత్సరం చివరి ట్రేడింగ్ రోజున భారత స్టాక్ మార్కెట్లు భారీ నష్టాలతో ముగిశాయి. మధ్యప్రాచ్యంలో పెరుగుతున్న ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయంగా నెలకొన్న ఆందోళనలు దేశీయ సూచీలపై తీవ్ర ప్రభావం చూపాయి. ఈ పరిణామాలతో పెట్టుబడిదారులు అమ్మకాలకు మొగ్గు చూపడంతో సెన్సెక్స్, నిఫ్టీ కుప్పకూలాయి.

సోమవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 1,635.67 పాయింట్లు నష్టపోయి 71,947.55 వద్ద స్థిరపడింది. అదేవిధంగా, నిఫ్టీ 488.20 పాయింట్లు పతనమై 22,331.40 వద్ద ముగిసింది. టెక్నికల్‌గా చూస్తే, నిఫ్టీ కీలకమైన 22,500 మద్దతు స్థాయిని కోల్పోవడం మార్కెట్‌లో మరింత బలహీనతకు సంకేతమని విశ్లేషకులు చెబుతున్నారు. 22,500-22,600 స్థాయి నిఫ్టీకి తక్షణ నిరోధకంగా మారవచ్చని అంచనా వేస్తున్నారు.

ముఖ్యంగా బ్యాంకింగ్, ఫైనాన్షియల్ రంగ షేర్లలో అమ్మకాల ఒత్తిడి స్పష్టంగా కనిపించింది. బజాజ్ ఫైనాన్స్, శ్రీరామ్ ఫైనాన్స్, ఎస్‌బీఐ షేర్లు నిఫ్టీలో టాప్ లూజర్లుగా నిలిచాయి. సెన్సెక్స్ ప్యాక్‌లో టెక్ మహీంద్రా, పవర్ గ్రిడ్ మాత్రమే లాభపడగా.. బజాజ్ ఫైనాన్స్, ఇండిగో, బజాజ్ ఫిన్‌సర్వ్, యాక్సిస్ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్ వంటి షేర్లు భారీగా నష్టపోయాయి.

లార్జ్‌క్యాప్ షేర్లతో పాటు బ్రాడర్ మార్కెట్లు కూడా పతనమయ్యాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 2.68 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 2.66 శాతం చొప్పున నష్టపోయాయి. రంగాల వారీగా చూస్తే నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్, నిఫ్టీ బ్యాంక్, నిఫ్టీ ఫైనాన్షియల్ సర్వీసెస్ సూచీలు అత్యధికంగా నష్టపోయాయి. మిడిల్ ఈస్ట్‌లో ఇరాన్ దాడులు విస్తరించడం, ఘర్షణల్లోకి హౌతీలు ప్రవేశించడం, అమెరికా బలగాల మోహరింపు వంటి పరిణామాలు ద్రవ్యోల్బణంపై ఆందోళనలను పెంచాయని, దీంతో ఇన్వెస్టర్లు సురక్షిత పెట్టుబడుల వైపు మళ్లారని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## రూపాయి భారీ పతనం..

**డాలర్ మారకంతో 95 స్థాయికి పడిపోయిన రూపాయి**



**న్యూఢిల్లీ:** భారత కరెన్సీ రూపాయి సోమవారం నాడు డాలర్ మారకంతో ఆల్‌టైమ్ కనిష్ఠాన్ని తాకింది. అంతర్జాతీయ పరిణామాలతో రూపాయి రోజురోజు నష్టపోతోంది. ఈరోజు డాలర్ మారకంతో 95.14 వద్ద కనిష్ఠస్థాయికి పడిపోయింది. రూపాయి 95 స్థాయికి పడిపోవడం ఇది మొదటిసారి. గతవారం కనిష్ఠస్థాయికి పడిపోయిన రూపాయి ఈరోజు ఉదయం కాస్త కోలుకుంది. ఈరోజు ప్రారంభంలో 130 పైసలు లాభపడి 93.59 వద్ద ప్రారంభమైంది. కానీ సెషన్ ముగిసేసరికి ఆల్‌టైమ్ కనిష్ఠానికి చేరుకుంది.

రూపాయి బలహీనతకు ఎన్నో కారణాలు ఉన్నాయి. పశ్చిమాసియా యుద్ధం కారణంగా అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు పెరుగుతున్నాయి. బ్రెంట్ క్రూడాయిల్ ధర బ్యారెల్‌కు 109 డాలర్లకు పైన ఉంది. దీనితో విదేశీ పెట్టుబడిదారులు దేశీయ మార్కెట్ల నుంచి నిధులను ఉపసంహరించుకుంటున్నారు.

ఈ నెలలో విదేశీ పెట్టుబడిదారులు దేశీయ మార్కెట్ల నుంచి సుమారు 11.5 బిలియన్ డాలర్లను వెనక్కి తీసుకున్నట్లు తెలుస్తోంది. గత శుక్రవారం సుమారు రూ.850 కోట్ల విలువైన ప్రభుత్వ సెక్యూరిటీలను విదేశీ పెట్టుబడిదారులు విక్రయించారు. ఇలా వివిధ కారణాలతో రూపాయి అత్యంత బలహీనమవుతోంది.

## 'సిమ్ బైండింగ్'పై వెనక్కి తగ్గిన కేంద్రం...

**డిసెంబర్ వరకు గడువు పొడిగింపు!**



**న్యూఢిల్లీ:** వాట్సాప్, టెలిగ్రామ్ వంటి ప్రముఖ మెసేజింగ్ యాప్‌లకు, వాటి వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం తాత్కాలిక ఊరట కల్పించింది. భద్రతా కారణాలతో తప్పనిసరి చేసిన 'సిమ్ బైండింగ్' నిబంధన అమలు గడువును ఈ ఏడాది డిసెంబర్ వరకు పొడిగించాలని భావిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. టెక్ కంపెనీలు ఎదుర్కొంటున్న సాంకేతిక సవాళ్ల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

ఒక యాప్ పనిచేయాలంటే, అది ఇన్‌స్టాల్ అయిన ఫోన్‌లోని సిమ్ కార్డుతో తప్పనిసరిగా అనుసంధానం కావడాన్నే 'సిమ్ బైండింగ్' అంటారు. గత ఏడాది నవంబర్‌లో కేంద్రం ఈ నిబంధనను తీసుకొచ్చి, 90 రోజుల్లో అమలు చేయాలని ఆదేశించింది. అయితే, దీన్ని అమలు చేయడంలో టెస్టింగ్, ఆపరేటింగ్ సిస్టమ్ (ఓఎస్) అప్‌డేట్స్ వంటి సాంకేతిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, తమకు మరింత సమయం కావాలని టెక్ కంపెనీలు కేంద్రాన్ని కోరాయి.

కంపెనీల అభ్యర్థనను సానుకూలంగా పరిశీలించిన కేంద్రం, గడువును డిసెంబర్ వరకు పొడిగించేందుకు సిద్ధమైనట్లు టెలికాం శాఖ ఉన్నతాధికారులను ఉటంకిస్తూ జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. దీనిపై అధికారిక ప్రకటన త్వరలోనే వెలువడే అవకాశం ఉంది. ఈ గడువు పొడిగింపుతో సిమ్ బైండింగ్ నిబంధనలను పక్కాగా అమలు చేయడానికి టెక్ కంపెనీలకు తగినంత సమయం లభిస్తుంది. అదే సమయంలో కోట్లాది మంది యూజర్లకు తక్షణమే ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉంటుంది.



# సూర్యవంశీ వీరబాదుడు...

**సీఎస్కేపై రాజస్థాన్ రాయల్స్ ఘనవిజయం**



**చెన్నై:** ఐపీఎల్ 2026 సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ అదిరిపోయే బోణీ కొట్టింది. యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ (52; 17 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్సర్లు) ఆకాశమే హద్దుగా చెలరేగడంతో, చెన్నై సూపర్ కింగ్స్‌పై 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. చెన్నై నిర్దేశించిన 128 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని కేవలం 12.1 ఓవర్లలోనే 2 వికెట్లు కోల్పోయి ఛేదించింది. సూర్యవంశీ ఆడిన తీరు మ్యాచ్‌కే హైలైట్‌గా నిలిచింది.

ఛేజింగ్ లో రాజస్థాన్‌కు, చెన్నై బౌలర్లను ఎదుర్కోవడం పెద్ద కష్టంగా అనిపించలేదు. ముఖ్యంగా ఓపెనర్‌గా వచ్చిన వైభవ్ సూర్యవంశీ ఆరంభం నుంచే బాదుడు మొదలుపెట్టాడు. క్రీజులోకి వచ్చిన కాసేపటికే బౌండరీలు, సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. కేవలం 17 బంతుల్లోనే 305.88 స్ట్రైక్ రేట్‌తో హాఫ్ సెంచరీ పూర్తి చేసి చెన్నై శిబిరాన్ని నిరాశకు గురిచేశాడు. పవర్‌ప్లే ముగిసేసరికి రాజస్థాన్ స్కోరు 74 పరుగులకు చేరిందంటే వైభవ్ విధ్వంసం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. తొలి వికెట్‌కు యశస్వి జైస్వాల్‌తో కలిసి కేవలం 38 బంతుల్లోనే 75 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి మ్యాచ్‌ను ఏకపక్షంగా మార్చేశాడు. సూర్యవంశీ ఔటైన తర్వాత వచ్చిన ధ్రువ్ జురెల్ (18; 9 బంతుల్లో) కూడా వేగంగా ఆడాడు. మరో ఎండ్‌లో యశస్వి జైస్వాల్ (38 నాటౌట్; 36 బంతుల్లో) నిలకడగా ఆడి, కెప్టెన్ రియాన్ పరాగ్ (14 నాటౌట్)తో కలిసి లాంఛనాన్ని పూర్తి చేశాడు.

అంతకుముందు, రాజస్థాన్ రాయల్స్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. రాజస్థాన్ బౌలర్ల కట్టుదిట్టమైన ప్రదర్శనతో చెన్నై సూపర్ కింగ్స్ బ్యాటర్లు చేతులెత్తేశారు. నిర్ణీత 20 ఓవర్లు కూడా ఆడకుండా 19.4 ఓవర్లలో 127 పరుగులకే కుప్పకూలింది. సంజూ శాంసన్ (6), కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (6) సహా టాపార్డర్ పూర్తిగా విఫలమైంది. ఒక దశలో 57 పరుగులకే 6 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో జేమీ ఓవర్టన్ (43; 36 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లు) ఒంటరి పోరాటం చేయడంతో చెన్నై ఆ మాత్రం స్కోరైనా చేయగలిగింది. రాజస్థాన్ బౌలర్లలో జోఫ్రా ఆర్చర్, నంద్రే బర్గర్, రవీంద్ర జడేజా తలో రెండు వికెట్లు పడగొట్టి చెన్నై పతనాన్ని శాసించారు. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో రాజస్థాన్ ఈ సీజన్‌లో తమ జైత్రయాత్రను ఘనంగా ప్రారంభించింది.

## ఈసారి రోహిత్ చాలా ప్రమాదకారి.. అన్ని జట్లకు ముప్పే: అనిల్ కుంబ్లే



**ముంబై:** ముంబై ఇండియన్స్ ఓపెనర్ రోహిత్ శర్మ ఈ ఐపీఎల్ సీజన్‌ను అద్భుతంగా ప్రారంభించడంపై భారత మాజీ కెప్టెన్ అనిల్ కుంబ్లే ప్రశంసల వర్షం కురిపించాడు. రోహిత్ తన '2.0 అవతార్'లోకి వచ్చేశాడని, అతని ప్రస్తుత ఫామ్ చూస్తుంటే ఈ సీజన్‌లో ప్రత్యర్థి జట్లకు ముప్పేనని హెచ్చరించాడు. కోల్‌కతా నైట్ రైడర్స్‌తో నిన్న జరిగిన మ్యాచ్‌లో రోహిత్ కేవలం 38 బంతుల్లో 78 పరుగులు చేసి ముంబై విజయంలో కీలక పాత్ర పోషించిన సంగతి తెలిసిందే.

ఈ ఇన్నింగ్స్‌పై స్టార్ స్పోర్ట్స్ కార్యక్రమంలో కుంబ్లే మాట్లాడుతూ.. "రోహిత్ శర్మ సరికొత్త 2.0 అవతార్‌లో వచ్చినట్లు కనిపిస్తోంది. మళ్లీ ఆధిపత్యం చెలాయించడానికి తాను సిద్ధంగా ఉన్నానని ఈ ఇన్నింగ్స్‌తో నిరూపించాడు. అతను మైదానం నలువైపులా బంతిని బాదిన తీరు, అతని పాత రోజులను గుర్తుకు తెచ్చింది" అని అన్నాడు. సునీల్ నరైన్, వరుణ్ చక్రవర్తి వంటి నాణ్యమైన స్పిన్నర్లపై సిక్సర్లు కొట్టడం అంత సులభం కాదని, కానీ రోహిత్ దానిని చాలా తేలికగా చేసి చూపించాడని కొనియాడాడు.


"రోహిత్ తన ఫిట్‌నెస్‌పై చాలా శ్రమించాడు. ఒక చిన్న విరామం తర్వాత తిరిగి వచ్చినప్పుడు, లయను అందుకోవడానికి ఐదు నుంచి ఏడు రోజులు పడుతుంది. కానీ, రోహిత్ అద్భుతంగా ఆడాడు. బౌండరీలు చిన్నవిగా ఉన్నప్పటికీ, అతను కొట్టిన షాట్లు నేరుగా స్టాండ్స్‌లోకి వెళ్లాయి. ఈ ఇన్నింగ్స్ చూస్తుంటే రోహిత్ ఈసారి చాలా పక్కాగా ఉన్నాడని తెలుస్తోంది. అతని ఈ వెర్షన్ మిగతా ఐపీఎల్ జట్లను కచ్చితంగా ఆందోళనకు గురిచేస్తుంది" అని కుంబ్లే అభిప్రాయపడ్డాడు.

**కేకేఆర్ వ్యూహాలను కుంబ్లే తప్పుబట్టిన కుంబ్లే**

ఇదే సమయంలో కోల్‌కతా నైట్ రైడర్స్ వ్యూహాలను కుంబ్లే తప్పుబట్టాడు. కేకేఆర్ తమ స్పిన్నర్లయిన సునీల్ నరైన్, వరుణ్ చక్రవర్తిలపై ఎక్కువగా ఆధారపడిందని, కానీ వారిని సరిగ్గా ఉపయోగించుకోలేదని విమర్శించాడు. "రోహిత్, రికెల్టన్ దూకుడుగా ఆడుతున్నప్పుడు పవర్‌ప్లేలో కెప్టెన్ అజింక్య రహానే.. నరైన్‌ను బౌలింగ్‌కు తీసుకురాకపోవడం ఆశ్చర్యం కలిగించింది. నరైన్ బౌలింగ్‌కు వచ్చేసరికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది.

## రూ. 25 కోట్లు పెట్టినా బౌలింగ్ చేయట్లేదు.. ఫ్రాంచైజీలను ముంచుతున్న ఆసీస్ స్టార్లు!

**ముంబై:** ఐపీఎల్ సీజన్ ఆరంభంలోనే ఫ్రాంచైజీలకు కొత్త తలనొప్పి మొదలైంది. వేలంలో కోట్లాది రూపాయలు కుమ్మరించి కొనుగోలు చేసిన ఆస్ట్రేలియా ఆటగాళ్ల గాయాలు, ఫిట్‌నెస్ సమస్యల కారణంగా పూర్తిస్థాయిలో అందుబాటులో లేకపోవడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. ముఖ్యంగా కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) రూ. 25.20 కోట్లు వెచ్చించి తీసుకున్న కామెరాన్ గ్రీన్ బౌలింగ్ చేయకపోవడం ఈ సమస్య తీవ్రతకు అద్దం పడుతోంది. సీజన్ తొలి మ్యాచ్‌లోనే గ్రీన్ కేవలం బ్యాట్స్‌మన్‌గా బరిలోకి దిగి 18 పరుగులు మాత్రమే చేశాడు. వెన్నునొప్పి సర్జరీ నుంచి కోలుకుంటున్నందున అతను బౌలింగ్ చేయలేడని కేకేఆర్ కెప్టెన్ అజింక్య రహానే స్వయంగా వెల్లడించాడు. "మా బౌలర్లు గాయపడ్డారు. గ్రీన్ బౌలింగ్ చేయలేకపోవడం సవాలుగా మారింది. అతను బౌలింగ్ మొదలుపెడితే జట్టు కూర్పు భిన్నంగా ఉంటుంది" అని రహానే పేర్కొన్నాడు. గ్రీన్ బౌలింగ్ గురించి ప్రశ్నించగా.. 'ఆ ప్రశ్న మీరు క్రికెట్ ఆస్ట్రేలియాను అడగాలి' అంటూ చమత్కరించడం పరిస్థితికి నిదర్శనం.



ఈ సమస్య కేవలం కేకేఆర్‌కే పరిమితం కాలేదు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఆటగాడు జోష్ హేజిల్‌వుడ్ ఫిట్‌నెస్ కారణంగా తొలి మ్యాచ్‌కు దూరమయ్యాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ పాట్ కమిన్స్, ఢిల్లీ క్యాపిటల్స్ ఆటగాడు మిచెల్ స్టార్క్ కూడా గాయాలతో ఇబ్బంది పడుతున్నారు. ఆటగాళ్ల వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్ పేరుతో క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) వారిపై నియంత్రణ విధించడమే దీనికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. రాబోయే రెండేళ్లలో 20 టెస్టులు ఆడాల్సి ఉన్నందున, సీఏ తమ ఆటగాళ్ల ఫిట్‌నెస్‌కు అధిక ప్రాధాన్యత ఇస్తోంది.

ఈ పరిణామాలతో ఫ్రాంచైజీలు తీవ్రంగా నష్టపోతున్నాయి. కోట్లు ఖర్చు చేసినా ఆటగాళ్ల సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకోలేకపోతున్నాయి. గాయపడిన ఆటగాళ్ల విషయంలో బీసీసీఐ నుంచి ఎలాంటి నష్టపరిహారం లేకపోవడంతో ఆర్థిక భారం మొత్తం ఫ్రాంచైజీలపైనే పడుతోంది. వేలానికి ముందే ఆటగాళ్ల లభ్యతపై స్పష్టత ఉండాలని, అవసరమైతే మధ్యలో ప్రత్యామ్నాయ ఆటగాళ్లను అనుమతించే నిబంధనలు తీసుకురావాలని, క్రికెట్ ఆస్ట్రేలియా వంటి బోర్డులు ఫ్రాంచైజీలకు నష్టపరిహారం చెల్లించాలా అనే డిమాండ్లు ఇప్పుడు బలంగా వినిపిస్తున్నాయి.

## రాష్ట్రస్థాయి ఇంటర్ స్కూల్స్ ఛాంపియన్‌షిప్..

**పవర్ హౌస్ తైక్వాండో అకాడమీకి 16 పతకాలు..!**

**న్యూఢిల్లీ:** 14వ తెలంగాణ ఓపెన్ రాష్ట్రస్థాయి ఇంటర్-స్కూల్స్ తైక్వాండో చాంపియన్‌షిప్ 2026లో పవర్ హౌస్ తైక్వాండో అకాడమీ లిటిల్ ఛాంప్స్ అద్భుత ప్రతిభ కనబరిచారు. క్రమశిక్షణ, పట్టుదలకు తోడు నైపుణ్యాన్ని ప్రదర్శించిన యువ క్రీడాకారులు 9 బంగారు పతకాలు, 1 వెండి పతకం, 6 కాంస్య పతకాలు గెలుపొందారు. ఒక టోర్నమెంట్‌లో ఇన్నేసి పతకాలు సాధించడం పవర్ హౌస్ అకాడమీ చరిత్రలోనే అత్యుత్తమ ప్రదర్శన అని నిర్వాహకులు తెలిపారు. మొత్తం 19 మంది పాల్గొనగా వీరిలో 16 మంది పోడియం మీద సగర్వంగా పతకాలు అందుకోవడం సంతోషకరమైన విషయమని వారు వెల్లడించారు.

తెలంగాణ ఓపెన్ స్టేట్ లెవల్ ఇంటర్-స్కూల్స్ తైక్వాండో చాంపియన్‌షిప్ 2026లో రాష్ట్రం నలుమూలల నుంచి కఠిన పోటీ ఎదురైనప్పటికీ, పవర్ హౌస్ జట్టు క్యోరుగు, పూమ్సే విభాగాల్లో అద్భుత ప్రదర్శనతో అదరగొట్టింది. ఈ గర్వకారణమైన సందర్భంలో వరల్డ్ తైక్వాండో గ్లోబల్ సభ్యులు, నేషనల్ పూమ్సే, క్యోరుగు రిఫరీలు అరవింద్ నంద్యాల సురేష్ బోయా (గ్రానూరా స్థాపకులు) విజేతలను అభినందించారు. ఈ పోటీల్లో పాల్గొన్న ప్రతి విద్యార్థిని వారు ప్రశంసించారు. ప్రతి విద్యార్థి పడిన కష్టం ఈ చారిత్రాత్మక విజయానికి కారణమని వారు తెలిపారు.రాష్ట్ర వార్తలు

జాతీయ స్థాయి ఛాంపియన్లను తయారు చేయడమే లక్ష్యంగా పవర్ హౌస్ తైక్వాండో అకాడమీ క్రమశిక్షణ అందిస్తోందని, నిరంతర సాధన.. ప్రతిభాభివృద్ధిపై దృష్టి సారిస్తూ ముందుకు సాగుతోందని వారు పేర్కొన్నారు. యువతరంలోని ప్రతిభను ప్రోత్సహిస్తూ మరిన్ని గొప్ప విజయాలను సాధించేందుకు అకాడమీ కట్టుబడి ఉందని తెలిపారు. ఇటీవలి ఈ విజయాన్ని పురస్కరించుకుని త్వరలోనే ఒక చిన్న విజయోత్సవ సమావేశం (సక్సెస్ మీట్) నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ అద్భుత విజయంతో పవర్ హౌస్ తైక్వాండో మరోసారి ప్రముఖ శిక్షణ కేంద్రంగా తన స్థానాన్ని బలపరచుకుందని, సమీప భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధిస్తామని విశ్వాసం వ్యక్తం చేసింది అకాడమీ యాజమాన్యం.



## సితార ఎంటర్‌టైనర్‌లో నితిన్




**టాకీస్:** చాలా కాలంగా సరైన బ్రేక్ కోసం ఎదురుచూస్తున్న టాలీవుడ్ యంగ్ హీరోల్లో ఒకరు నితిన్. హిట్లు, ఫ్లాపులతో సంబంధం లేకుండా సినిమాలు చేస్తున్న నితిన్ తాజాగా కొత్త ప్రాజెక్టును రివీల్ చేశాడు. సోమవారం నితిన్ కు పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ మేకర్స్ ఈ కొత్త సినిమాను ప్రకటించారు. టాలీవుడ్ లీడింగ్ ప్రొడ్యూసర్ సూర్య దేవర నాగవంశీ సితార ఎంటర్‌టైన్ మెంట్స్‌పై ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ప్రొడక్షన్ నంబర్ 43గా రాబోతున్న ఈ చిత్రాన్ని డైరెక్ట్ చేయబోయేది ఎవరనేది క్లారిటీ రావాల్సి ఉంది. స్టైలిష్ లుక్‌లో ఉన్న నితిన్ తాజా స్టిల్‌లో కనిపిస్తుండగా.. ఇంతకీ ఈ మూవీ ఎలాంటి స్టోరీతో రాబోతుంది. హీరోయిన్, ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణులు ఎవరనే దానిపై రానున్న రోజుల్లో క్లారిటీ ఇవ్వనున్నారు మేకర్స్. నితిన్ నటించిన ఎక్స్‌ట్రా ఆర్డినరీ మ్యాన్, రాబిన్ హుడ్, తమ్ముడు చిత్రాలు బాక్సాఫీస్ వద్ద మూవీ లవర్స్‌ను నిరాశపరిచాయి. ఈ నేపథ్యంలో ఈ సారి ఎలాగైనా మంచి హిట్ కొట్టాలని చూస్తున్నాడు నితిన్. మరి నితిన్‌కు ఈ సినిమానైనా కలిసొస్తుందేమో చూడాలంటున్నారు మూవీ లవర్స్.

## సల్మాన్‌తో వంశీ పైడిపల్లి మూవీ



**టాకీస్:** బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్‌తోవంశీ పైడిపల్లి సినిమా చేయనున్నట్లు ఎప్పటినుంచో వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. ఈ ప్రాజెక్ట్‌పై అధికారిక ప్రకటన వెలువడింది. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై ఇది రానున్నట్లు తెలుపుతూ ఓ ఫొటో షేర్ చేసింది. ఏప్రిల్ నుంచి దీని షూటింగ్ ప్రారంభం కానున్నట్లు వెల్లడించింది. ఇందులో హీరోయిన్‌గా నయనతారను ఎంపిక చేసినట్లు కూడా ఇటీవల వార్తలు వచ్చాయి. బాలీవుడ్ సీనియర్ నటుడు అనిల్‌కపూర్ ఓ కీలక పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. త్వరలోనే నటీనటుల వివరాలు పంచుకోనున్నారు. 2027లో దీన్ని విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సల్మాన్ ఖాన్ 'మాతృభూమి'లో నటిస్తున్నారు. దీనితోపాటే వంశీ సినిమాను కూడా మొదలు పెట్టనున్నట్లు తెలుస్తోంది. భారీస్థాయిలో దీన్ని తెరకెక్కించనున్నారు. నిజానికి సల్మాన్‌కు మంచి హిట్ పడి చాలాకాలం అయింది. మరోవైపు వంశీ కూడా చివరిగా విజయ్ హీరోగా 'వారసుడు' రూపొందించారు. అది అనుకున్న స్థాయిలో అంచనాలను అందుకోలేకపోయింది. అప్పటినుంచి సల్మాన్ ప్రాజెక్ట్ పైనే వర్క్ చేశారు. దీంతో ఈ ప్రాజెక్ట్ ఇద్దరికీ కీలకంగా మారింది.




# 'ఎపిక్'పైనే ఆశలు పెట్టుకున్న వైష్ణవి..

టాకీస్: సోషల్ మీడియా ద్వారా క్రేజ్ తెచ్చుకున్న భామల్లో వైష్ణవి చైతన్య ఒకరు. ఈ చిన్నది సోషల్ మీడియా, యూట్యూబ్ వీడియోల ద్వారా మంచి గుర్తింపు తెచ్చుకుంది. అంతే కాదు ఈ అమ్మడు పలు షార్ట్ ఫిలిమ్స్ లోనూ నటించి ఆకట్టుకుంది. హీరోయిన్ రేంజ్ అందంతో ఈ కుర్రది కుర్రాళ్ల గుండెల్లో బాణాలు గుచ్చింది. కెరీర్ బిగినింగ్ లో పలు సినిమాల్లో చిన్న చిన్న పాత్రలు చేసి మంచి మార్కులు కొట్టేసింది. ఆతర్వాత హీరోయిన్ గా మారి సినిమాలు చేస్తుంది. బేబీ సినిమాతో హీరోయిన్ గా మారింది వైష్ణవి. సాయి రాజేష్ దర్శకత్వంలో, ఆనంద్ దేవరకొండ నటించిన బేబీ సినిమా భారీ విజయాన్ని అందుకుంది. చిన్న సినిమాగా వచ్చిన ఈ మూవీ.. ఎవ్వరూ ఊహించని విధంగా సినిమా హిట్ అవ్వడంతో పాటు నటీనటులు మంచి గుర్తింపు తెచ్చిపెట్టింది. బేబీ సినిమా తర్వాత లవ్ మీ అనే సినిమా చేసింది. ఈ సినిమాడి జాస్టర్ అయ్యింది. ఇక ఇప్పుడు ఎపిక్ అనే సినిమా చేస్తుంది. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతుంది. ఈ సినిమా తప్ప వైష్ణవి చేతిలో మరో సినిమాలేదు. దాంతో ఈ సినిమా పై భారీ ఆశలు పెట్టుంది ఈ అమ్మడు. ఎపిక్ సినిమా హిట్ అయితే ఈ చిన్నదానికి అవకాశాలు క్యూ కడతాయి. సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే ఈ అమ్మడు. రెగ్యులర్ గా ఫోటోలు పంచుకుంటూ అభిమానులను ఆకట్టుకుంటుంది. గ్లామరస్ ఫొటోలతో పాటు ట్రెడిషనల్ ఫోటోలను కూడా పంచుకుంటుంది ఈ కుర్ర భామ.

## చిరుతో మరోమారు బాబీ సినిమా

**టాకీస్:** మన శంకర వరప్రసాద్ గారు అనే చిత్రంతో మంచి హిట్ కొట్టిన చిరంజీవి ఇప్పుడు మరో భారీ ప్రాజెక్ట్‌తో అభిమానులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ చిత్రం తన కెరీర్‌లో 158వ చిత్రంగా రూపొందుతుంది. ఈ చిత్రాన్ని గతంలో



'వాల్తేరు వీరయ్య'తో బాక్సాఫీస్ వద్ద సెన్సేషన్ సృష్టించిన దర్శకుడు కేఎస్ రవీంద్ర (బాబీ) తెరకెక్కిస్తున్నారు. ఈ హిట్ కాంబినేషన్ మళ్లీ రిపీట్ అవుతుండటంతో సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. 'వాల్తేరు వీరయ్య' తర్వాత బాబీ మెగాస్టార్‌ను మరింత పవర్‌ఫుల్‌గా చూపించబోతున్నారని సినీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. తాజా సమాచారం ప్రకారం, ఈ క్రేజీ ప్రాజెక్ట్ రెగ్యులర్ షూటింగ్ ఏప్రిల్ 20, 2026 నుంచి ప్రారంభం కానుంది. ఇప్పటికే ప్రీ-ప్రొడక్షన్ పనులు పూర్తయ్యాయి. బెంగాల్ బ్యాక్‌డ్రాప్‌లో తండ్రీకూతుళ్ల భావోద్వేగాలతో కూడిన మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ కథను రూపొందించినట్లు సమాచారం. ఈ సినిమాను వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ అత్యంత భారీ బ్జడెట్‌తో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. టాలీవుడ్ మాత్రమే కాకుండా ఇతర ఇండస్ట్రీల నుంచి కూడా ప్రముఖ నటులను ఎంపిక చేస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి.సినిమా కాస్టింగ్ విషయంలో కూడా ఆసక్తికర విషయాలు బయటకు వస్తున్నాయి. మెగాస్టార్‌కు భార్య పాత్రలో నేషనల్ అవార్డ్ విన్నర్ ప్రియమణి నటించనున్నట్లు తెలుస్తోంది. కూతురు పాత్రలో 'కన్నప్ప' ఫేమ్ ప్రీతి ముకుందన్ ఎంపికైనట్లు సమాచారం.

## ఓటీటీలోకి సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని

**టాకీస్:** శివాజీ, లయ, రోహన్ నటించిన తాజా చిత్రం సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని. మార్చిలో థియేటర్‌లో విడుదలై నవ్వులు పంచిన ఈ సినిమా ఇప్పుడు ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. ఏప్రిల్ 3 నుంచి నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ కానుంది. సుధీర్ శ్రీరామ్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో అలీ, ధనరాజ్, ఇమ్మాన్యుయేల్ నవ్వులు పూయించారు. శ్రీరామ్ (శివాజీ) నిజాయతీపరుడైన పంచాయతీ కార్యదర్శి. కొత్తకోట సమీపంలోని హార్స్‌లీహిల్స్‌లో భార్య ఉత్తర (లయ), కొడుకు బిట్టు అలియాస్ నితిన్ (రోహన్)తో కలిసి జీవిస్తుంటాడు. ఓ దీపావళి రోజున వాళ్ల ఇంటికి ఆ ఊరి ఎస్సై విక్రమ్ వాసుదేవ్ (ప్రిన్స్) వస్తాడు. అతనికి ఆడవాళ్ల పిచ్చి. అప్పటికే శ్రీరామ్‌తో ఓసారి గొడవ జరుగుతుంది. దీంతో అతనిపై పగ పెంచుకున్న విక్రమ్.. ఇంట్లో తను లేడని తెలిసి ఉత్తరపై అఘాయిత్యానికి ప్రయత్నిసాడు. కట్ చేస్తే.. అనూహ్యంగా శ్రీరామ్ కొడుకు చేతిలో ఆ ఎస్సై హత్యకు గురవుతాడు. మరి ఆ తర్వాత ఏమైంది? ఆ హత్య కేసు నుంచి తన కుటుంబాన్ని కాపాడుకునేందుకు శ్రీరామ్ ఏం చేశాడు? రూ.కోటి డబ్బుతో ఉన్న తన గిఫ్ట్ బ్యాగ్ ఎత్తుకెళ్లారంటూ స్థానిక ఎమ్మెల్యే తిమ్మప్ప (శరత్ లోహితాశ్వ) గ్యాంగ్ శ్రీరామ్ వెంట పడటానికి కారణమేంటి? ఈ మొత్తం కథకు కానిస్టేబుల్ సుధీర్ (ధనరాజ్)కు ఉన్న సంబంధం ఏంటి? అన్నది చిత్ర కథ.



## రూ.1,365 కోట్లు సాధించిన 'ధురంధర్ 2'..

### ధురంధర్ చూసి పాఠాలు నేర్చుకోవాలన్న ఆర్జీవి

**టాకీస్:** రణ్‌వీర్ సింగ్ హీరోగా తెరకెక్కిన దురంధర-2 చిత్రం తొలిరోజు నుంచే వసూళ్ల సునామీ సృష్టిస్తోంది. ఇప్పటివరకూ ప్రపంచవ్యాప్తంగా రూ.1,365 కోట్లు తన ఖాతాలో వేసుకుంది. దీంతో మొదటిభాగం ఆల్‌టైమ్ కలెక్షన్ల రూ.1,307 కోట్లును ఈ సీక్వెల్ కేవలం 11 రోజుల్లోనే దాటేసింది. ఇకపోతే ఉలవురు ప్రముఖులు ఈ చిత్రాన్ని ప్రశంసిస్తూనే ఉన్నారు. తాజాగా దర్శకుడు రామ్ గోపాల్ వర్మ మరోసారి సోషల్ మీడియా వేదికగా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆదిత్య ధర్ తెరకెక్కించిన తాజా చిత్రం 'ధురంధర్ 2' బాక్సాఫీస్ వద్ద సృష్టిస్తోన్న ప్రభంజనంపై స్పందిస్తూ.. చిత్ర పరిశ్రమలోని ప్రముఖుల మౌనాన్ని ఆయన ప్రస్తావించారు. ఈ సినిమా సాధించిన విజయం ఒక 'అణుబాంబు' లాంటిదని ఆయన అన్నారు. ఆదిత్య ధర్ చిత్ర పరిశ్రమ కింద ఒక అణుబాంబును పేల్చారు. కానీ ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. మిగిలిన చిత్ర పరిశ్రమ అంతా మౌనం పాటిస్తోంది. 'ధురంధర్ 2' పేలుడు ధాటికి అందరూ అంతరిక్షంలోకి వెళ్లారేమో.. అందుకే వారి చప్పట్లు ఇక్కడికి వినిపించడం లేదు. బహుశా వారంతా ఇది కేవలం ప్రచారమే అని, త్వరలోనే తగ్గిపోతుందని తమలో తాము గుసగుసలాడుకుంటున్నారేమో. అలా అనుకుంటూ మళ్లీ పాత కాలపు మూస సినిమాలను తీయాలని చూస్తున్నారు.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.